
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
1
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 5 జనవరి 2025





నేడే ముగ్గుల పోటీలు

- ఉదయం 10 గంటల నుంచి

సిద్ధమైన వేదికలు



నెల్లూరులో : వీఆర్ కళాశాల మైదానం
కావలిలో : రైల్వేస్టేషన్ రోడ్డులోని కారొనేషన్ రీడింగ్ రూం ఆవరణం
గూడూరులో : సనత్ నగర్‌లోని శ్రీచైతన్య కళాశాల ఆవరణం

తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వేదికలు సిద్ధమయ్యాయి. ఆదివారం ఉదయం నెల్లూరు నగరం, కావలి, గూడూరు పట్టణాల్లో పోటీలు జరుగుతాయి. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరుగుతాయి. నెల్లూరు నగరంలో వీఆర్ కళాశాల మైదానం (వీఆర్సీ కూడలి), కావలిలో రైల్వేస్టేషన్ రోడ్డులోని కారొనేషన్ రీడింగ్ రూం ఆవరణం, గూడూరులోని సనత్‌నగర్‌లో శ్రీచైతన్య కళాశాల ఆవరణలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మైదానాల్లో ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలో జరిగే పోటీలకు నెల్లూరులోని సీఎంఆర్ చందన బ్రదర్స్ లోకల్ స్పాన్సర్‌గా ఉన్నారు. నెల్లూరులో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, మెప్మా పీడీ రాధమ్మ ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారు. గూడూరులో డీఎస్పీ రమణకుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేయనున్నారు. కావలిలో జరిగే పోటీలకు ఆర్డీవో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీధర్ ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారు. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. వీటితో పాటు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదిన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి.

'సంక్రాంతి'కి సిద్ధమవుతున్న బరులు

ఏర్పాట్లలో పందెపురాయుళ్ల బిజీ

కోళ్ల రకాన్ని బట్టి రూ.1.5 లక్షల వరకు ధర



పందేనికి సై!

సంక్రాంతి సంబరంలో పందెపురాయుళ్లు సై అంటున్నారు. కోడిపందేల నిర్వహణకు ఎక్కడెక్కడ బరులు గీయాలో అన్వేషణ పూర్తి చేశారు. కాళ్లకు కత్తికట్టి.. బరిలోకి దింపేందుకు పందెంకోళ్లనూ సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పొరుగు ప్రాంతాల నుంచి వీటిని జిల్లాకు తీసుకొచ్చి నిపుణుల ద్వారా ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పించారు. జాతి రకం, రంగు, డిమాండ్‌ను బట్టి రూ. 1.5 లక్షల వరకు కొన్నారు. చాటుమాటుగా తీసుకొచ్చిన ఈ కోళ్లకు పౌష్టికాహారం అందించి. బలంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక పోలీస్ దాడులు జరగకుండా సిఫారసుల కోసం నేతల వద్ద క్యూ కట్టారు.

- వివరాలు 2లో

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- జిల్లాకు రానున్న 167 బస్సులు
- సాధారణ చార్జీలే వసూలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా దూరప్రాంతాల్లోని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు నడుపు తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం మురళీబాబు ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి నెల్లూరు వచ్చేందుకు రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి 167 స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ నుంచి 15 బస్సులు, 10న 35, 11న 32, 12న 35, 13న 4 బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. బెంగుళూరు నుంచి నెల్లూరుకు 9వ తేదీన 6 బస్సులు, 10న 17, 11న 12, 12న 7 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. చెన్నై నుంచి 9వ తేదీన 5 బస్సులు, 10న 5, 11న 5, 12న 5 బస్సులు నడుపు తున్నామన్నారు. స్పెషల్ బస్సులలో సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నామని, ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించి నట్లు చెప్పారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను నడిపేందుకూ సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

చిన్న వివాదం.. పెద్ద ఘర్షణ

- ఓ వర్గంపై మరో వర్గం యువకుల దాడి
- తీవ్రంగా గాయపడి ఓ యువకుడి మృతి
- కారకులను శిక్షించాలని దళితుల ఆందోళన
- నిందితులను తప్పిస్తున్నారంటూ ఆగ్రహం
- సర్దిచెప్పి పంపిన స్థానిక నాయకులు, పోలీసులు

అల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చిన్నపాటి వివాదం.. ఘర్షణకు దారి తీసింది. ఓ వర్గం యువతపై మరో వర్గం యువకులు దాడి చేయడంతో ఒకరు మృతి చెందారు. అయితే, ఈ కేసులో నిందితులను తప్పిస్తున్నారంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం నార్తుమోహూరు కూడలిలో మృతుడి కుటుంబీకులు, బంధువులు మృతదేహంతో రోడ్డుపై బైఠాయించారు. వివరాల్లోకి వెళితే.. అల్లూరు మండలం నార్తుమోహూరు కూడలి సమీపంలోని దళితవాడకు చెందిన చేజర్ల కార్తీక్ (24) తిరుపతిలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. రోడ్డు ప్రమాదంలో చేతికి గాయం కావడంతో విశ్రాంతి కోసమని కొన్నిరోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఒకే సామాజిక వర్గానికి చెందిన యువకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకొని ఘర్షణకు దారితీసింది. గ్రామస్థుల చొరవతో వివాదం సద్దుమణిగింది. కాసేపటి తరువాత 8 మంది యువకులు బైక్‌లపై నార్తుమోహూరు ప్రధాన కూడలికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యర్థి వర్గానికి చెందిన ఇద్దరితోపాటు కార్తీక్ కూడా ఉన్నారు. ఇదే అదునుగా కొమ్మి సుధీర్, తుమ్మతాటి ఆదిత్య, కొమ్మి సురేష్, అరగల పాల్, అరగల అబ్రహాన్, అజ్జం హేమంత్, మాచాల మనోజ్, అరగల లక్మయ్యలు తమతో తెచ్చుకున్న కర్రలు, రాడ్లతో దాడిచేశారు. ఈ దాడిలో ఇద్దరు తప్పించుకోగా కార్తీక్‌పై దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన కార్తీక్ అక్కడికకక్కడే కూలిపోయాడు. దీంతో 8 మంది యువకులు పరారయ్యారు.

బంధువుల ఆందోళన

కార్తీక్‌పై దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్న బంధువులు, కుటుంబసభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను అల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ నగదు చెల్లించక పోవడంతో వైద్యం అందించకుండా కాలయాపన చేశారని బాధితులు వాపోయారు. చివరకు నగదు చెల్లించాక త్వరితగతిన చెన్నైకి తీసుకెళ్లమని సిఫారసు చేశారు. దీంతో నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే కార్తీక్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న కావలి రూరల్ సీఐ పాపారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడికి వచ్చి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, 8 మంది కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అయితే, ఈ కేసులో ప్రధాన నిందితుడి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదని మృతుడి కుటుంబీకులు రోడ్డుపై మృతదేహంతో బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పినా వారు వినలేదు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలంటూ భారీగా నినాదాలు చేశారు. ఒక సందర్భంలో హరిజనవాడపై దాడికి ప్రయత్నించేందుకు అటువైపు వైపుకు దూసుకెళ్లారు. వీరిని అదుపు చేసేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నం చేసి నిలువరించారు. చివరికి స్థానిక నాయకులు కలగజేసుకొని వారికి సర్ది చెప్పగా వారు నిరసన విరమించి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.



పోలీసులను నిలదీస్తున్న మహిళలు



మృతుడు చేజర్ల కార్తీక్ (ఫైల్)

క్యారమ్‌లో నువ్వా.. నేనా!?

- నెల్లూరు వేదికగా జాతీయస్థాయి పోటీలు
- నేటి నుంచి 8వ తేదీ వరకు పోరు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- వివిధ రాష్ట్రాల నుంచి 400 మంది క్రీడాకారుల హాజరు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు వేదికగా 29వ అఖిల భారత ఫెడరేషన్ కప్ క్యారమ్ పోటీలు ఆదివారం నుంచి జరగనున్నాయి. నగరంలోని నెల్లూరు క్లబ్ ప్రాంగణంలో భారత క్యారమ్ ఫెడరేషన్, ఆంధ్రరాష్ట్ర క్యారమ్ అసోసియేషన్‌ల సహకారంతో జిల్లా క్యారమ్ అసోసియేషన్ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దేశంలోని 25 రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిక ప్రాతాలు, భారతీయ సంస్థలకు చెందిన వారితో కలిపి 400 మంది క్రీడాకారులు, 8 మంది ప్రపంచ చాంపియన్‌లు కూడా పోటీలకు హాజరవుతున్నారు.

● ప్రతిష్టాత్మకంగా నిర్వహణ

జాతీయ క్యారమ్స్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా జిల్లా అసోసియేషన్ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి, భోజన సదుపాయాలను సిద్ధం చేశారు. పరుషుల సింగిల్స్, డబుల్స్ విభాగాలు, మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో అన్ని ఈవెంట్‌లను నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఏఐసీఎఫ్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌గా ఈ పోటీల్లో సాధించిన పాయింట్లు భారత జట్టు ఎంపికకు కీలకం కానున్నాయి. పోటీలను తిలకించేందుకు స్విట్జర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసెఫ్ మేయర్, సెక్రటరీ జనరల్ డాక్టర్ వీడీ.నారాయణ్, ఆలిండియా క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు రకిబుల్ హుస్సేన్, జనరల్ సెక్రటరీ భారతి నారాయణ్, ఏపీ అధ్యక్షుడు నీరజ్‌కుమార్ సంపతి, కార్యదర్శి షేక్.అబ్దుల్ జలీల్‌లతో పాటు జిల్లాలోని మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు హాజరు కానున్నారు. పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను క్యారమ్స్ ఫెడరేషన్ కప్ కో చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, జిల్లా క్యామర్ అసోసియేషన్ కార్యదర్శి వీ .రఘురామ్ శ్రీధర్, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు పర్యవేక్షిస్తున్నారు.



కొండాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు

విద్యార్థుల ఆకలి తీరింది!

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజనం పథకం శనివారం ప్రారంభమైంది. ఆయా కాలేజీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించారు.

- వివరాలు 4లో..



ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఎస్సీ సంఘాలు, ఇతర కుల సంఘాల నాయకులు భారీగా అర్జీలు అందచేశారు. నెల్లూరులో శనివారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఆయన వినతులు స్వీకరించారు.

- వివరాలు 2లో..

తిరగబడ్డ బతుకుబండి!

- హైవేపై ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- పొగమంచు, ఆపై అతివేగమే కారణం
- దంపతులిద్దరూ దుర్మరణం
- సంగం వద్ద ముంబయి హైవేపై ఘటన

ఘటనాస్థలిలో ఆటో, ఆర్టీసీ బస్సు



ఊరూరా తిరిగి కూరగాయలు అమ్మితేనే ఆ దంపతులకు పూట గడిచేది. రోజంతా కష్టపడి వచ్చే సంపాదనతోనే తన ముగ్గురు పిల్లల్ని కంటికి రెప్పలా పెంచుతున్నారు. ఎంతో సాఫీగా సాగిపోతున్న వారి బతుకు బండి అనుకోని ప్రమాదంతో తలకిందులయ్యింది. సంగం మండలం వెంగారెడ్డి పాళెం వద్ద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై శనివారం ఉదయం ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా వచ్చే ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. రోడ్డుపై పొగమంచు ఓ కారణమైతే, బస్సు అతివేగమే మరో కారణమైంది. ఏదైతేనేం ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. వీరి ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలారు.

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనసూయ నగర్ గ్రామానికి చెందిన నెల్లూరు వెంకటశేషయ్య (35), వెంకట వరలక్ష్మి (30) దంపతులు నిత్యం ఆటోలో కూరగాయలు విక్రయిస్తూ తమ ముగ్గురు పిల్లల్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఆటోలో కూరగాయలు తీసుకుని దంపతులిద్దరూ ఇంటి వద్ద నుంచి సంగం బయలుదేరారు. పొగమంచు దట్టంగా ఉండటం, ముంబయి జాతీయ రహదారిపై వాహనాలు కనిపించకపోవడంతో నెమ్మదిగా వెంగారెడ్డి పాళెం రోడ్డు క్రాస్ చేసి కొంత దూరం వచ్చారు. ఈ నేపథ్యంలో ఎదురుగా వస్తున్న ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించబోయి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో నడుపుతున్న వెంకటశేషయ్య తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో వెనుక సీట్లో కూర్చొని ఉన్న వెంకట వరలక్ష్మికి తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేష్ సంఘటనాస్థలికి చేరుకుని వెంకట వర లక్ష్మిని 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. వెంకటశేషయ్య మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఆర్టీసీ బస్సును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతులు వెంకటశేషయ్య, వెంకటవరలక్ష్మి (ఫైల్)



అనాథగా మారిన పిల్లలు

● సంఘటనా స్థలం పరిశీలన

హైవేపై ఘటనా స్థలిని ఆత్మకూరు డిపో మేనేజర్ కరీమున్నీసా, ఆత్మకూరు వాహన తనిఖీ అధికారి రాములు పరిశీలించారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు స్వయంగా బస్సును నడిపి కండీషన్‌ను పరిశీలించారు. ప్రమాదానికి ఆర్టీసీ డ్రైవర్‌తోపాటు పొగమంచు కూడా కారణమై ఉంటుందని డిపో మేనేజర్ పేర్కొన్నారు.

● అనాథలైన ముగ్గురు పిల్లలు

ప్రమాదంలో దంపతులిద్దరూ మృతి చెందడంతో వారి పిల్లలు శివ (13), బాలాజీ (9), ప్రవళ్లిక (7)లు అనాథలుగా మిగిలారు. మృతదేహాల వద్ద విలపిస్తున్న పిల్లల్ని చూసి గ్రామస్థులూ కంటతడి పెట్టుకున్నారు. ప్రభుత్వం స్పందించి పిల్లలను ఆదుకోవాలని కోరారు



రోధిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న అబ్దుల్ అజీజ్, కమిషనర్ సూర్యతేజ

విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : అజీజ్

నెల్లూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్షమని ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. నెల్లూరులోని వీఆర్, పీఎస్ఎం మునిసిపల్ జూనియర్ కళాశాలల్లో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం ద్వారా రాష్ట్రంలోని 44,129 స్కూళ్లు, కళాశాలల్లోని 33,81,000 మంది విద్యార్థుల ఆకలి తీరుతోందన్నారు. ప్రభుత్వం ఎన్ని కష్టాల్లో ఉన్నా విద్యార్థులకోసం ఈ పథకం తీసుకువచ్చిందన్నారు. మంత్రి నారాయణ చొరవ తీసుకుని గతంలో మాదిరిగా విద్యార్థులకు ఉచిత మెటీరియల్స్, లెక్చరర్స్‌ను కూడా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పీఎస్ఎం కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను అజీజ్ ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు కమిషనర్ సూర్యతేజతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులు, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ హైఫా, కళాశాలల ఇన్‌చార్జి రాజేంద్ర, నేతలు జాఫర్‌షరీఫ్, నన్నేసాహెబ్, హరికృష్ణ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

త్రివిక్రమ అలంకారంలో

వేణుగోపాలుడు



నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి): అధ్యయనోత్సవంలో భాగంగా మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం రాత్రి త్రివిక్రమ అలంకారం కనుల పండు వగా జరిగింది. ఈ సందర్భంగా ఆళ్వార్ల ఘోష్టి, దివ్య నాలాయర ప్రబంధ ఘోష్టి గానం, శాత్తుముర్రై జరిగాయి. ఉదయ గోదాదేవికి విశేష పూజలు జరిగాయి. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా మామిడి ఆంజనేయులు శ్రేష్టి, మామిడి హజరత్ శ్రేష్టి వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, సహాయ కమిషనర్ జే .శ్రీనివాసులు తదితరులు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

205 మంది మహిళా అభ్యర్థుల హాజరు



నెల్లూరు పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు శనివారం 205 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. ఐదోరోజు పరీక్షలకు 418 మంది హాజరు కావాల్సి ఉండగా, 205 మంది హాజరయ్యారు, 213 గైర్హాజరయ్యారు. ఉదయం ఐదు గంటల నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలను జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ పర్యవేక్షించారు.

- నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి)

ఇంటి పేరుతోనే ప్రసిద్ధి

- ఎన్నో అద్భుత సినీగీతాల రచయిత వెన్నెలకంటి
- నేడు రాజేశ్వరప్రసాద్ 4వ వర్ధంతి

స్మరించుకుందాం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'మాటరాని మౌనమిది.. మౌన వీణ గానమిది'.... ప్రేమంటే ఏమిటంటే.. నిను ప్రేమించాక తెలిసే'.. తదితర ఎన్నో మధుర సినీ గీతాలకు ప్రాణం పోసిన గీత రచయిత వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్. ఆయన గేయ రచయితేకాక మాటల రచనతో ఎన్నో అనువాద చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేశారు. తెలుగు సినిమా రంగంలో ఆణిముత్యంగా రాణించిన ఆయన 1957 నవంబరు 30న నెల్లూరు జిల్లా కావలిలో జన్మించారు. ఆయన తన 11వ ఏటనే ఆటవెలదిలో 'భక్త దుఃఖ నాశ పార్వతీ సముకుటంత' శతకం రాసి అబ్బురపరిచారు. శ్రీరామచంద్రుడు సినిమాలో సినీ గేయరచయితగా ఆరంగ్రేటం చేశారు.

● ఉద్యోగాన్ని వదలి..



వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ (ఫైల్)

1979లో ఆయన చిత్తూరు జిల్లా చంద్రగిరిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగిగా చేరారు. బ్యాంకులో పనిచేస్తుండగానే సినీ నటుడు ప్రభాకర్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. రచయిత కొంతకాలం గడిచాక ఆయన బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి సినీ గేయరచయితగా స్థిరపడ్డారు. డబ్బింగ్ చిత్రాలకు స్క్రిప్ట్ రచయితగా గుర్తింపు పొందారు. వెన్నెలకంటి దాదాపు రెండు వేలకుపైగా సినిమా పాటలు రాశారు. ఆదిత్య 369, ఘరానా అల్లుడు, ఘరానా బుల్లోడు, క్రిమినల్, శ్రీకృష్ణార్జున విజయం, సమరసింహారెడ్డి, శ్రీను తదితర చిత్రాలకు మంచి పాటలను రాశారు. ఆయన చివరిగా పెంగ్విన్ సినిమాకు పనిచేశారు. 1988లో వచ్చిన మహర్షి చిత్రానికి రాసిన 'మాటరాని మౌనమిది'... అనే పాట శ్రోతలను ఎంతో అలరించింది.

● బాలు, కమల్‌తో అవిభావ సంబంధం

ప్రముఖ నేపథ్య గాయకడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ప్రముఖ సినీ నటుడు కమలహాసన్‌తో రాజేశ్వరప్రసాద్‌కు అవినాభావ సంబంధం ఉంది. కమలహాసన్ అనువాద చిత్రాలు పంచతంత్రం, పోతురాజు, దశావతారం, మన్మథ బాణం చిత్రాలు, తమిళం నుంచి వచ్చిన సరోజ, ప్రేమఖైదీ సినిమాలకు వెన్నెలకంటి మాటల రచయిత పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శశాంక్, తండ్రి బాటలోనే మాటల రచయితగా రాణిస్తున్నారు. డబ్బింగ్ చిత్రాలకు సైతం మాటలు రాస్తున్నారు. చిన్నకుమారుడు రాకేందుమౌళి పాటల రచయితగా, గాయకుడిగా రాణిస్తున్నారు.

● జిల్లాకు కీర్తి ప్రతిష్టలు

వెన్నెలకంటి స్క్రిప్ట్‌రైటర్‌గా, పాటలు, మాటలు రచయితగా జిల్లాకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారు. వెన్నెలకంటి తన చిన్నతనంలో హరికథలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు బాగా వినేవారు. కళాశాలల్లో చదివే రోజుల్లో రసవినోదిని పేరుతో రేడియో ప్రసంగాలు చేశారు. 1975లో విజయవాడ ఆకాశవాణి కేంద్రం వారు కవితల పోటీలు నిర్వహించగా, ఆ పోటీల్లో వెన్నెలకంటి కవితలు ఎంపికయ్యారు. జంధ్యాల రాసిన ఏక్ దిన్‌కా సుల్తాన్, ఈ చరిత్ర ఏ సిరాతో.. ఎవ్వనిచే జనించు, దర్పణం.. వంటి నాటకాల్లోనూ వెన్నెలకంటి నటించారు. 2021 జనవరి 5న ఆయన గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మరణం చిత్రసీమతోపాటు నెల్లూరీయులను తీవ్ర విషాదానికి గురిచేసింది.

22న వీఎస్‌యూలో నూతన కోర్సు శిక్షణ ప్రారంభం

వెంకటాచలం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యూనివర్సిటీ సంయుక్తంగా ఈనెల 22వ తేదీన కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ - డొమెస్టిక్ నాన్ వాయిస్ అనే కోర్సు శిక్షణను ప్రారంభించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సమన్వయకర్త డాక్టర్ జే విజేత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశానికి 18 నుంచి 25 ఏళ్ల వయస్సు గల వారు అర్హులని, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువత తమ దరఖాస్తులను వీఎస్‌యూ కళాశాల కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9573482179ను సంప్రదించాలని తెలిపారు.

సంక్రాంతి పండుగ వస్తోందంటే చాలు ఎక్కడెక్కడో స్థిరపడిన జిల్లావాసులంతా సొంతూళ్లకు చేరిపోతుంటారు. వీరితోపాటు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి ప్రత్యేక అతిథులు కూడా జిల్లాకు చేరుకుంటుంటారు. అవేమని అనుకుంటున్నారా!? ఒకటి పందెపురాయుళ్లు, రెండు కోడిపుంజులు. మరో 9 రోజుల్లో పండుగ ఉండటంతో పందేల కోసం ఇప్పటికే సరంజామా సిద్ధం చేసుకుంటున్నారు. బరులు ఎక్కడ ఏర్పాటు చేయాలి.. కోడికాళ్లకు కత్తులు కట్టేవారు ఎక్కడున్నారు? పోలీసులకు సిఫారసులు తదితర పనులను ఇప్పటినుంచే ప్రారంభించేశారు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)



పందేలకు సై!

- 'సంక్రాంతి'కి సిద్ధమవుతున్న బరులు
- ఏర్పాట్లలో పందెపురాయుళ్ల బిజీ
- కోళ్ల రకాన్ని బట్టి రూ.1.5 లక్షల వరకు ధర

కోడిపందేల నిర్వహణకు ఉభయగోదావరి జిల్లాల తర్వాత నెల్లూరు జిల్లాకే ప్రాధాన్యత ఉంది. జిల్లాలో పందేలు ఆడేందుకు ప్రకాశం, కడప, చిత్తూరు జిల్లాలతోపాటు తమిళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా ఎంతోమంది జిల్లాకు చేరుకుంటారు. ఈ క్రమంలో జిల్లాలో ఎక్కడెక్కడ పందేలు నిర్వహించనున్నారు.. సమీప పట్టణాల్లో లాడ్జీలు ఉన్నాయా? లేదా పల్లెల్లో కొన్ని రోజులపాటు ఉండేందుకు ఎవరైనా అంగీకరిస్తారా!? తదితర వాటిపై ఆరా తీస్తున్నారు.

● జాతికోళ్లకు భలే గిరాకీ

పందేల కోసం ఇతర రాష్ట్రాల నుంచి జాతి కోళ్లను గుట్టుచప్పుడు కాకుండా జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రధానంగా కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి డేగ, పండుడేగ, పర్ల, కాకి, సేతు, సవల, కొక్కిరాయి ఇలా అనేక రకాల జాతి పుంజులను కొనుగోలు చేస్తున్నారు. వీటిని జిల్లాకు తీసుకు వచ్చి ఐదు రెట్ల ఆదాయానికి విక్రయిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో రూ.2వేలు ఉన్న కోడిని జిల్లాకు తీసుకువచ్చి రూ.10వేల నుంచి 15 వేల వరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఇక ఉభయగోదావరి జిల్లాల నుంచి జాతి కోళ్లను రూ.70 వేల నుంచి 1.5 లక్షల వరకు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

● ప్రత్యేక శిక్షణ

రూ.లక్షలు పోసి కొనుగోలు చేసిన జాతి పుంజులకు జిల్లాలోని రహస్య ప్రాంతాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం అర్ధగంటపాటు చెరువుల్లో ఈత కొట్టించడం, బాదం, జీడిపప్పు, పిస్తా, ఖర్జూరం ఇలా 24 రకాల పదార్థాలను కలిపి ఉండలు చేసి కోళ్లకు తినిపిస్తున్నారు. అలాగే ఎదుటి కోడిని ఎలా ఢీకొనాలో నిష్ణాతులతో శిక్షణ ఇప్పిస్తూ పందేలకు సిద్ధం చేస్తున్నారు.

వలేటివారిపాలెంలో అప్పుడే..

వలేటివారిపాలెం : మండలంలోని చుండి దాదినీడిచెరువులోని పడమర వైపు బీడుప్రాంతంలో కోడిపందేలు జోరుగా సాగుతున్నాయి. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ పందేలు నిర్వహిస్తున్నారు. లక్ష్మక్కపల్లి, ఎగువపల్లి అయ్యవారిపల్లె, లింగన్నపాలెం చుండి, కాకర్లవారిపాలెం, యర్రారెడ్డిపాలెం, వెంటళాపురం, లిగసముద్రం, చినఅమ్మపాలెం, పోలినేనిచెరువు, గరుకుపాలెం, అంకభూపాలపురం, తదితర గ్రామాల నుంచి పందెపురాయుళ్లు భారీగా చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు సమాచారం. చినఅమ్మపాలెంకు చెందిన ఓ వ్యక్తి సహకారంతో ఈ పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులను మేనేజ్ చేయాలంటూ సదరు వ్యక్తి ఒక్కో పుంజు యజమాని నుంచి ఐదారు వందలు వసూలు చేస్తున్నారు.

● రెండు రకాలుగా పందేలు

జిల్లాలో కోడి పందేలను రెండు రకాలుగా నిర్వహిస్తుంటారు. బరిలోకి దిగిన కోడి కాళ్లకు కత్తి కట్టి ఆ రెండు కోళ్లలో ఒకటి కింద పడేదాకా పందెం కాస్తారు. ఇక కత్తి కట్టకుండా బరిలోకి దింపిన కోళ్లలో ఒకటి కింద పడిపోవాలి. ఇలా రూ.వేల నుంచి లక్షల దాకా పందేలా కాస్తారు. ఈ యేడాది సంక్రాంతి బరిలో ఏయో ప్రాంతాల్లో ఎన్ని రూ.కోట్లకు పందేలు జరుగుతాయో!? ఎందరి జీవితాలు జూదం మత్తులో మునిగిపోతాయో వేచి చూడాలి.



విలేకరులతో మాట్లాడుతున్న చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులురెడ్డి, పక్కన వీసీ సూర్యతేజ తదితరులు

2041 వరకు మాస్టర్‌ప్లాన్

- రూపకల్పనకు విస్తృత చర్యలు
- ఓ కన్సల్టెన్సీతో సమావేశం
- నుడా చైర్మన్ కోటంరెడ్డి వెల్లడి

నెల్లూరు (జడ్పీ), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా)లో 2041 వరకు మాస్టర్ ప్లాన్‌ను రూపకల్పన చేస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం నుడా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కోటంరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ సర్కారు నుడా మాస్టర్ ప్లాన్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. నాలుగేళ్లుగా మాస్టర్‌ప్లాన్‌ను పెండింగ్‌లో పెట్టి గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. అభివృద్ధికి కీలకమైన మాస్టర్‌ప్లాన్ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టామని, తాను వీసీ సూర్యతేజ, ఇతర అధికారులు కలిసి ఓ కన్సల్టెన్సీతో సమావేశమై మాట్లాడినట్లు తెలిపారు. నుడా పరిధిలోని 146 గ్రామాలు, 15మండలాల పరిధిలో 900 చ.కి.మీ మేర మాస్టర్‌ప్లాన్‌తో కన్సల్టెన్సీతో చర్చించి త్వరితగతిన నివేదిక తయారుచేసి ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. అలాగే బుచ్చిలో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు కాగులపాడు నుంచి బుచ్చి టోల్‌గేట్ వరకు అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణంపైనా చర్చించినట్లు తెలిపారు. ఈ మాస్టర్ ప్లాన్ తయారైతే మంత్రి నారా యణ సహకారంతో నుడాను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కోటంరెడ్డి స్పష్టం చేశారు. వీసీ సూర్యతేజ మాట్లాడుతూ మూడు నెలల్లో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని కన్సల్టెన్సీకి సూచించినట్లు చెప్పారు. మాస్టర్‌ప్లాన్‌లో రైల్వేలైన్లు పొందుపరచడమే గాక అన్ని ప్రాంతాలతో సమగ్ర మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు, రోడ్లు, పార్కులు, తదితర మౌలికసదుపాయాలకూ ఈ మాస్టర్‌ప్లాన్ ఉపయోగపడుతుందన్నారు.

నిషేధిత యాంటీబయోటిక్స్ అమ్మితే లైసెన్సులు రద్దు చేయండి : జేసీ



మాట్లాడుతున్న జేసీ కార్తీక్, పక్కనే వివిధ శాఖల అధికారులు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 4(ఆంధ్రజ్యోతి): నిషేధిత యాంటీ బయోటిక్స్ అమ్మకాలు సాగించే వ్యాపార సంస్థల లైసెన్సుల రద్దుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ మత్స్యశాఖ అధికారులకు ఆదేశించారు. ఆక్వా సాగులో నిషేధిత యాంటీ బయోటిక్స్ వినియోగాన్ని అరికట్టే అంశంపై ఆయన అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రొయ్యల మేత, మందులు, ప్రొబయోటిక్స్ అమ్మకాలు చేస్తున్న దుకాణాలు, తయారీ దారుల ప్లాంట్లను క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నిషేధిత యాంటీ బయోటిక్స్‌ను రొయ్యల సాగులో వినియోగించడం వల్ల రొయ్యల ఎగుమతులు తిరస్కరణకు గురవుతున్నాయ న్నారు. దీనివల్ల రైతులు, ఎగుమతిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ప్రతివారం విధిగా తనిఖీలు నిర్వహించి, నెలకొక సమావేశం నిర్వహించి ప్రగతిని సమీక్షించుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మత్స్యశాఖ జేడీ ఎం.నాగేశ్వర రావు, నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, డ్రగ్ కంట్రోల్ ఏడీ వీరకుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారులు నీరజ, ప్రణతి ఫ్లోరా, మత్స్యశాఖ ఏడీ వీవీఆర్. బాబు, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి సంజయ్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వర్ణాంధ్ర చైతన్య యాత్ర

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి): భారతసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నగరంలోని గాంధీ బొమ్మ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు స్వర్ణాంధ్ర చైతన్య యాత్ర ను నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ కార్యదర్శి ఎస్‌కే ఖాసీం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాటన్ సంచులను ప్రముఖ సామాజికవేత్త కుట్టి కుసుమకుమారి అందచేస్తారని, కార్యక్రమంలో డాక్టర్ కే శిఖామణి, కే కృష్ణయ్య, రమాదేవి పాల్గొంటారని తెలిపారు.

రేపు సీనియర్ పెన్షనర్లకు సన్మానం

ఏపీ ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు నగరంలోని రోటరీ ఆడిటోరియంలో సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్నామని ఆ అసోసియేషన్ అధ్య క్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కమిషన్‌కు వినతుల వెల్లువ

- 363 అర్జీలు స్వీకరించిన చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- నెల్లూరు నగరంలో కులసంఘాల నేతలు ర్యాలీ



రాజీవ్‌రంజన్ మిశ్రాకు అర్జీలు సమర్పిస్తున్న ప్రజలు



వినతిపత్రం సమర్పించేందుకు ర్యాలీగా వెళుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై వినతులు స్వీకరించేందుకు నెల్లూరుకు వచ్చిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఎస్సీ సం ఘాలు, ఇతర కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో అర్జీలు అందచేశారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి అధికారులతో ఆయన సమావేశం నిర్వహిం చారు. అనంతరం విన తులు స్వీకరించారు. పలువురు కుల సంఘాల నేతలు తమ అభి ప్రాయాలను చైర్మన్‌కు తెలిపారు. వర్గీకర ణకు అనుకూలంగా, వ్యతిరేకంగా 363 అర్జీలు అందచేశారు.

● ర్యాలీలతో అర్జీల సమర్పణ

రాజీవ్ రంజన్ మిశ్రాకు ఎస్సీలు ఎక్కువ సంఖ్యలో అర్జీలు సమర్పించారు. అర్జీలు సమర్పించడానికి ముందు ర్యాలీ లు నిర్వహించారు. సీమాంధ్ర ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ ఆధ్వర్యంలో నాయకులు నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి రాజీవ్‌రంజన్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ పెరిగిన ఎస్సీల జనాభాకు అనుగుణంగా 59 కులాల కులగణన జరిపి, దామాషా ప్రకారం రిజర్వేషన్ల శాతం పెంచాలన్నారు. ఇప్పటి వరకు రిజర్వేషన్ ఫలాలు అనుభవించిన మాలలను సీ గ్రూపుగాను వర్గీకరణ చేయాలని కోరారు.


● మాలమహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ స్వర్ణ వెంకయ్య ఆధ్వర్యంలో దళిత నాయకులు రంజన్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వెంకయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు తీర్పును వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ, బల్లి వెంయ్య, రొప్పోలు రఘు, పల్లం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ ఎస్సీ సెల్ నేతలు కాకి ప్రసాద్, మాతంగి కృష్ణ తదితరులు కూడా మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాలకు దామాషా ప్రకారం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు కే నాగేశ్వరరావు, ఎస్ ఇజ్రాయిల్, పీ. పెంచలయ్య తదిరులు పాల్గొన్నారు.

● ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్లు బెల్లంకొండ గోపి మాదిగ, కోలగట్ల రమేష్ మాదిగ, విద్యార్థి సమైక్య నేత డాక్టర్ గోవింద సురేష్‌మాదిగ తదితరులు ర్యాలీగా వెళ్లి మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బద్దెపూడి వివేక్‌మాదిగ, చెరుకూరి సోమయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. ఉదయ్‌కృష్ణ మాదిగ, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ర్యాలీగా కలెక్టరేట్‌కి వెళ్లి అర్జీలు సమర్పించారు.

● అలాగే వివిధ మాదిగ సంఘాల నాయకులు కొమ్మల కృష్ణయ్య, జనార్దన్‌రావు, గడ్డం శేఖర్ తదితరులు ర్యాలీగా వెళ్లి వినతి పత్రం సమర్పించారు. ఎస్సీ జాబితాలో 37వ నంబరుతో ఉన్న మాలదాసు ఉపకులాన్ని స్వతంత్ర కులంగా గుర్తించి నిత్యదాసుగా ఎస్సీ-డీ విభాగంలో చేర్చాలని మాలదాసుల సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస పెరుమాళ్ తదితరులు వినతిపత్రం సమర్పించారు. వారు సాంప్రదాయ వృత్తి వేషధారణతో అర్జీలు సమర్పించటం ఆకట్టుకుంది.

పూర్తి సమాచారం అందించండి : మిశ్రా



ఎస్సీ ఉపకులాల వారీగా వారి స్థితిగతులపై పూర్తి సమాచారం అందచేయాలని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం తిక్కన భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంఘిక, ఆర్థిక, విద్యాపరం గానే కాకుండా రాజకీయంగాకూడా ఎస్సీల స్థితిగతులను కమిషన్ పరిశీలన చేస్తుంద న్నారు. అదే విధంగా ఎస్సీ లబ్ధిదారుల్లో ఉపవర్గాలను కూడా పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ కమిషన్ కోరిన విధంగా ఎస్సీ ఉపకులాల వివరాలతో సమగ్ర నివేదిక అందచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్సీ కులాల సమగ్ర వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ ఆనంద్ చైర్మన్‌కు వివరించారు. సమావేశంలో జేసీ కార్తీక్, ఎస్సీ సౌజన్య, డీఆర్‌వో ఉదయభాస్కర్, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

నమ్మకస్థుడే హంతకుడు

- కావలిలో వివాహిత హత్యకేసులో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీధర్



మాట్లాడుతున్న కావలి డీఎస్పీ శ్రీధర్, సీఐ ఫిరోజ్

కావలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వివాహిత హత్యకేసు నిందితుడు నయన్ బిస్వాస్‌ను శుక్రవారం మధ్యాహ్నం కావలి రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద అరెస్టు చేసి అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో కావలి ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన శ్రీకాంత్ బిస్వాస్ కావలిలో మొలల ఆసుపత్రి నిర్వహిస్తున్నాడు. గాయత్రీనగర్ సొంతింట్లో నివాసం ఉంటూ సహాయకుడిగా పశ్చిమ బెంగాల్‌కే చెందిన నయన్ బిస్వాస్‌ను రప్పించుకుని తమ ఇంటిలోనే ఉంచుకుంటున్నారు. అయితే శ్రీకాంత్ బిస్వాస్ సతీమణి అర్పితపై నయన్ బిస్వాస్ మోజు పడ్డాడు. గతంలో అనేక పర్యాయాలు ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. గతేడాది డిసెంబరు 31వ తేదీ అర్ధరాత్రి వరకు శ్రీకాంత్ బిస్వాస్, నయన్ బిస్వాస్‌లు ఇంటిలోనే మద్యం సేవించారు. అర్ధరాత్రి తర్వాత శ్రీకాంత్ బిస్వాస్ తన సోదరుడితో కలిసి ఒక బెడ్ రూంలో పడుకున్నారు. శ్రీకాంత్ భార్య అర్పిత బిస్వాస్ తన చిన్న కుమార్తెతో కలిసి మరొక బెడ్‌రూంలో పడుకున్నారు. నిందితుడు నయన్ బిస్వాస్ హాలులో పడుకున్నారు. తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో నయన్ బిస్వాస్ మద్యం మత్తులో అర్పిత బిస్వాస్ నిద్రిస్తున్న బెడ్‌రూంలోకి వెళ్లి ఆమెపై అత్యాచారం చేసే ప్రయత్నం చేయడంతో ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆయన అక్కడే ఉన్న ఇనుప రాడ్‌తో తలపై బలంగా కొట్టడంతో మృతి చెందింది. మృతదేహాన్ని ఇంటిలో నుంచి బయటకు లాక్కెళ్లి పక్కనే ఉన్న పొలంలో పడేసి లైంగికదాడి చేశారు. అనంతరం అక్కడ నుంచి పరార్ అయ్యాడు. ఒకటో తేదీ ఉదయం 6గంటలకు శ్రీకాంత్ బిస్వాస్ నిద్రలేచి చూడగా తన భార్య కనిపించలేదు. బయటకొచ్చి చూడగా పొలంలో వివస్త్రగా ఉండటాన్ని గమనించి సహాయకుడు నయన్ బిస్వాస్ కోసం వెతికాడు. ఆయన కనిపించక పోవటంతో అనుమానం వ్యక్తం చేస్తూ ఒకటో పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీఐ ఫిరోజ్ నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నయన్ బిస్వాస్ నేరాన్ని అంగీకరించాడు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(క్రైం), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మద్రాసు బస్టాండు వైపు నుంచి మితిమీరిన వేగంతో ఆర్టీసీ వైపు వస్తున్న కారు రోడ్డు పక్కనే నిద్రిస్తున్న గుర్తుతెలియని వృద్ధుడిని తొక్కుకుంటూ వెళ్లగా, అతను అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గుర్తుతెలియని వృద్ధుడు (60) ఆర్టీసీ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ రాత్రిళ్లు సుందర్‌లాడ్జీ సమీపంలోని దుకాణాల వద్ద నిద్రించేవాడు. శుక్రవారం అర్ధరాత్రి ఆర్టీసీ వైపు వస్తున్న ఓ కారు వేగంగా వృద్ధుడిని తొక్కుకుంటూ వెళ్లిపోయింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న సౌత్‌ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా ప్రమాదానికి కారణమైన కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వివారాలు తెలిసినవారు సౌత్ ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

నెల్లూరులో సైకిల్ మెకానిక్ దారుణహత్య

గడ్డపారతో తలపై మోది హతమార్చారు • గంజాయి ముఠా పనేనా...?



ఘటనాస్థలంలో వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(క్రైం), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సైకిల్ షాపు నిర్వహిస్తున్న ఓ వృద్ధుడిని గుర్తు తెలియని వ్యక్తులు గడ్డపారతో తలపై మోది, పదునైన ఆయుధంతో దాడిచేసి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున నెల్లూరు నగరంలోని తూకుమాన్‌మిట్ట పెన్నానది సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, పెన్నానది సమీపంలో ఎండీ అహ్మద్ రసూల్(65) నివాసం ఉంటున్నారు. గుప్తాపార్కు సమీపంలోని గుంతబడి వద్ద ఆయన సైకిల్ షాపు నిర్వహిస్తున్నారు. రసూల్ మొదటి భార్య మృతిచెందడంతో అబిదాని అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. వారికి నలుగురు సంతానం. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో అబిదాని తన పిల్లలతో చెన్నైలో ఉంటోంది. రసూల్ ప్రస్తుతం ఒంటరిగానే ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఆయన తన ఇంట్లో దారుణ హత్యకు గురయ్యాడు.ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ములుముడి బస్టాండు వద్ద నివాసం ఉంటున్న రసూల్ మేనల్లుడు ఇబ్రహీంకు తెలియజేశారు. ఇబ్రహీం సంఘటనా స్థలానికి చేరుకొని అనంతరం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గడ్డపారతో తలపై మోది, పదునైన ఆయుధంతో దాడిచేయడంతోనే అహ్మద్ రసూల్ మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు వారు హత్య కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. రసూల్ ఇంటికి సమీపంలో కొంతమంది నిత్యం గంజాయి, మద్యం సేవిస్తుండేవారని, ఈ క్రమంలో పలుమార్లు రసూల్ వారిని వారించేవాడని తెలిసింది. శుక్రవారం రాత్రి కూడా సమీప ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయి సేవిస్తుండగా రసూల్ అడ్డుకున్నాడని, వారే హత్య చేసి ఉండవచ్చని స్థానికులు పోలీసులకు తెలియచేశారు. ఈ క్రమంలో పోలీసులు ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

సోమశిలకు 2,902 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 2,902 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.754 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,050, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువ 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	113
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	226
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7431
వెండి కిలో ధర	రూ. 90,400
వెండి ఒక గ్రాము	రూ.93.40

అగ్రహారంలో విజృంభిస్తున్న జ్వరాలు

- ఆందోళనలో గ్రామస్థులు





మంచం పట్టిన జ్వర పీడితులు

కలువాయి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కలువాయి మండలం అగ్రహారం గ్రామంలో గత పది రోజులుగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రధానంగా ఎస్టీ కాలనీలో ఇంటికి ఒకరిద్దరు మంచం పట్టారు. ప్రస్తుతం సుమారు 50 మంది జ్వరంతో బాధపడు తున్నారు. ఒళ్లు నొప్పులతో జ్వరం మొదలై తరువాత ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోతుం డటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. జ్వరాల బారిన పడిన వారిలో కొందరు కలువాయిలోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో, మరికొందరు నెల్లూరులో వైద్యచికిత్స తీసుకుంటు న్నారు. ఇంకొందరు భయపడి చెన్నైకి కూడా వెళ్ళినట్లు తెలిపారు. కాగా, వైద్యచికిత్స కోసం ఆర్థిక ఇబ్బందు లకు గురికావల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతు న్నారు. గిరిజనులకు స్థోమత లేకపోవడంతో ఇంటి వద్దే చికిత్స పొందుతున్నారు. కాగా, గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో దోమ లు ప్రబలి జ్వరాలు వ్యాపించి నట్లు గ్రామస్థులు చెబుతు న్నారు. గ్రామంలో జ్వరా లతో అవస్థలు పడుతున్నా పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులైనా స్పందించి జ్వరాలు అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

ఫీవర్ సర్వే చేస్తున్నాం

మండలంలోని అగ్రహారంలో ఇంటింటికీ వైద్యసిబ్బంది వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నట్లు కుల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక తెలిపారు. గత రెండు రోజులుగా గ్రామంలో వైద్యశిబిరం కూడా ఏర్పాటుచేసి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. జ్వరాలు అదుపులోనే ఉన్నట్లు తెలిపారు.

- కుల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక

కామ్మో... జ్వరం



తాటిపర్తిలో మురుగు కాలువను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ

పొదలకూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాలకు గ్రామాలు మంచం పడుతున్నాయి. దీంతో ఆసుపత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతోన్నాయి. మలేరియాతో పాటు ఎక్కువగా చికున్ గున్యా, డయేరియా లక్షణాలతో బాధపడుతున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. టైఫాయిడ్ కేసులు ఓ మోస్తరుగా నమోదవుతున్నాయి. కాగా అక్కడ క్కడ డెంగ్యూ కేసులు సైతం నమోదవుతోన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం డెంగ్యూ కేసులు లేవని చెపుతున్నప్పటికీ ప్రైవేటు వైద్యశాలల్లో డెంగ్యూ పేరుతో రోగుల నుంచి రూ.వేలకు వేలు పిండుకుంటున్నారు. అధిక వర్షాలు, పారి శుధ్య లోపమే వ్యాధుల వ్యాప్తికి ప్రాధానకారణమైంది. పది రోజుల నుంచి జ్వరాల తీవ్రత అధికమైంది. ప్రధానంగా మండ లంలోని తాటిపర్తి, మహమ్మదా పురం, పొదలకూరు, అయ్యప్పనగర్, డేగపూడి, తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. జ్వరాల బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజలకు అవ గాహన కల్పించాల్సిన అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవరిస్తున్నా రు. కాగా శనివారం జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ తాటిపర్తిలో పర్యటించారు. మురుగు కాలువలను, పరిసరాలను పరిశీలించారు.

అదానీ కృష్ణపట్నం పోర్టుకి ఎక్సలెన్స్ అండ్ ఎక్సలెంట్ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న అదానీ కృష్ణపట్నం పోర్టు ప్రతినిధులు

ముత్తుకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గ్వాలియర్‌లో శనివారం జరిగిన 38వ నేషనల్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్ (ఎన్ సిక్యూసీ)- 2024 కన్వెన్షన్‌లో అదానీ కృష్ణపట్నం పోర్టు ప్రతినిధులు ఎక్సలెన్స్, ఎక్సలెంట్ అవార్డులు అందుకున్నారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా, అటల్ బిహారీ వాజ్ పేయ్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మే షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌తో కలిసి ప్రజలలో పెట్టుబడి పెట్టడం, మంచి భవిష్యత్తును నిర్మించడం అనే థీమ్‌తో వార్షిక ఈవెంట్ ను నిర్వహించారు. ఇందులో అదానీ కృష్ణపట్నం పోర్టు నుంచి రెండు బృందాలు క్వాలిటీ సర్కిల్ (క్యూసీ) కేటగిరి ఎంట్రీ 'ఎస్‌టీఎస్ క్రేన్ యొక్క అప్‌గ్రేడ్ చేసిన మల్టీ ఆపరేషన్', కైజెన్ కేటగిరీ ఎంట్రీ 'క్విక్ రిలీజ్ హుక్ ఫర్ ఎక్స్‌కవేటర్ షిఫ్టింగ్ ఇన్ వెస్సెల్ హూచ్'లో దాని ఫ్లాగ్‌షిప్ కేస్ స్టడీస్‌ను ప్రదర్శించడం ద్వారా జాతీయ సమావేశం లో పాల్గొనే అర్హత సాధించారు. ఈ రెండు ప్రాజె క్టులు ఈ సంవత్సరం తైవాన్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆఫ్ క్వాలిటీ సర్కిల్ (ఐసీక్యూసీ) కి అర్హత సాధించాయి. అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్ జట్టును అభినందించారు.

బైక్ ఢీకొని యాచకురాలి మృతి

రాపూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని యాచకురాలు మృతిచెందిన సంఘటన స్థానిక పెట్రోలు బంక్ వద్ద శనివారం జరిగింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్కూటరిస్టును 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, యాచకురాలి వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క దాడి : ఒకరికి గాయాలు

ఉదయగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామ బీసీ కాలనీలో షేక్ జానీబాషా అనే వ్యక్తిపై ఓ పిచ్చికుక్క దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. జానీబాషా తన నివాసానికి సమీపంలో ఉన్న బోరు బటన్ నొక్కి వస్తుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా అతనిపై దాడి చేసింది. గాయపడిన జానీ బాషాను కుటుంబ సభ్యులు వైద్యశాలకు తీసుకెళ్లారు.

బస్సు దిగుతూ కింద పడి మహిళకు తీవ్ర గాయాలు

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దువ్వూరు వద్ద ఓ మహిళ బస్సు దిగుతూ కిందపడి తీవ్ర గాయాలకు గురైన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. వివరాల మేరకు.. దువ్వూరు గ్రామానికి చెందిన ఎన్ పెంచలమ్మ రెండురోజుల కిందట పామూరులోని బంధువుల ఇంటికి వెళ్లి శనివారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేందుకు పామూరు నుంచి నెల్లూరు వెళ్లే ఆర్టీసీ బస్సులో ఎక్కింది. దువ్వూరులో స్టేజీ లేకపోవడంతో బుచ్చిరెడ్డిపాళెంకు టిక్కెట్ తీసుకుంది. కాగా, దువ్వూరు రాగానే కండక్టర్‌కు చెప్పి బస్సు ఆపింది. ఈక్రమంలో బస్సు దిగుతూ కిందపడడంతో ఆమెకు తీవ్ర గాయమైంది. దీంతో ఆమెను 108 వాహనంలో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ఈమేరకు సంగం ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇలా ఉంటే రోగాలు రావా?

- రోడ్లపైనే ఇళ్లలో వాడిన నీరు.. పేడదిబ్బలు
- పరిశుభ్రతకు ఆమడదూరంలో యాదవవీధి
- అంటురోగాలు ప్రబలుతాయని స్థానికుల ఆందోళన

జలదంకి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని యాదవ బజారు వీధిలోని రోడ్డు మురుగుకూపంలా మారింది. రోడ్డుకిరువైపులా నివసిస్తున్న ప్రజలు తమ ఇళ్లలో వాడిన నీరంతా రోడ్డుపైకి వదిలేస్తున్నారు. ఈ సమస్యతో నీరు రోడ్డుపైనే నిలిచి రోడ్డంతా మురుగుకూపంలా మారుతుంది. ఈ సమస్యను పంచాయతీ పాలకులు, సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు ఈ రోడ్డు పక్కనే గేదె లు కట్టేయడంతో పాటు పేడదిబ్బలు కూడా వేస్తున్నారు. దీంతో ఈ రోడ్డు మరింత దుర్గంధంగా మారడంతో అటువైపు గ్రామస్థులు వెళ్లేందుకు జంకుతున్నారు. రోడ్డుపై నడిచి వెళ్లాలంటే మురుగు తొక్కుకుంటూ ఇళ్లలోకి వెళ్లాల్సి వస్తుందని వాతున్నారు. పారిశుధ్యం కొరవడటంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని యాదవబజారు వీధి ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



జలదంకిలో రోడ్డుపైన పారుతున్న మురుగునీరు

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

- ఎం.మల్లయ్య, సంగం ఎంఈవో -2



ఇంటర్వ్యూ...

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మెనూ ప్రకారమే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని ఆ మేరకు చర్య తీసుకున్నట్లు ఎంఈవో-2 మల్లయ్య తెలిపారు.

? ఏకోపాధ్యాయుడు సెలవు పెడితే ఎలా.

! మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 14 ఉన్నాయి. ఏకోపాధ్యాయుడు ఉన్న చోట సెలవు పెడితే ఆ కాంప్లెక్స్ పరిధిలో పనిచేసే సీఆర్పీ హాజరై పాఠశాల నిర్వహించేలా చర్యలు చేపడుతున్నాం. వారు ఆరోజు విధులు నిర్వర్తిస్తారు.

? అపార్ నమోదు ఎంతవరకు వచ్చింది.

! ఇప్పటివరకు 80శాతం పూర్తయింది. మిగిలిన వారికి పుట్టినతేదీ, ఆధార్ లేకపోవడం, ఉన్నా తప్పులు ఉండడంతో తేడా వస్తోంది. వాటిని సరిచేసి అపార్ నూరుశాతం పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం.

? ఈ ఏడాది పాఠశాలలకు కాంపొనెట్ నిధులు వచ్చాయా.

! మొత్తం మంజూరు కాలేదు. 50 శాతం మాత్రమే మంజూరు చేశారు. ఆ నిధులతోనే పాఠశాలలో మరుగుదొడ్ల పరిశుభ్రత, మినీ మినరల్ వాటర్‌ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు.

విద్యలో రాణించిన వారికే ఉజ్వల భవిష్యత్తు

- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

కొండాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశలో రాణించిన వారికే ఉజ్వల భవిష్యతు ఉంటుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంను ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనంతరరం విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. కళాశాల ఆవరణలో మొక్కను నాటి దాని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 175మంది విద్యార్థులకు భోజనప్లేట్లు, గ్లాసులు అందించిన టెలికమ్ అడ్వైజరీ మెంబర్ తాటికొండ అనూషను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, రైతు కార్యదర్శి పోలినేని రమేష్, మండల మాజీ వైస్ చైర్మన్ పోలినేని చంద్రబాబునాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు దాసరి అశోక్, నర్రా చెంచు నాయుడు, నర్రా శివన్నారాయణ, జాగర్లమూడి శ్రీను, గుడవల్లూరు సర్పంచ్ మాచర్ల, కుంకు మోహనరావు పాల్గొన్నారు.



కొండాపురం : భోజనం పెట్టించుకుంటున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



బిట్రగుంట : భోజనం చేస్తున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి

● ఇష్టంతో కష్టపడి చదవాలి

బిట్రగుంట: ఇంటర్ విద్యార్థులు ఇష్టంతో చదివితే ఐదేళ్లలో ఉన్నత స్థానాల్లో స్థిరపడతారని ఈ విషయాన్ని గుర్తించుకుని కష్టపడాలని చదివాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. కప్పరాళ్ళతిప్ప ఇంటర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు. రెండేళ్ల పాటు మధ్యాహ్నభోజనానికి తాండ్ర సతీష్ నాయుడు టీడీపీ మండల కన్వీనర్ మాలెపాటి నాగేశ్వరరావు, సహాయ సహకారాలు అందించారని ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎంఈఓ జయమ్మ, టీడీపీ నేతలు రంగారెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, రఘురామనాయుడు, ఉంటాల వెంకయ్య, మాధవరావు ఉన్నారు.

● దగదర్తి మండలంలో..

ఇంటర్ కళాశాలలో మధ్యాహ్నభోజన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శ పమిడి రవికుమార్ చౌదరి, పార్టీ మండలాధ్యక్షుడు హనుమంతరావు పాల్గొన్నారు.

● కందుకూరు: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచన మేరకు నాయకులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఇక్బాల్ అహ్మద్, దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, రఫీ, బెజవాడ ప్రసాదు ఉన్నారు.

● మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు వరం

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుచేయడం ఇంటర్ విద్యార్థులకు వరమని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాణీశ్రీ అన్నారు. శనివారం కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు ఇచ్చిందని, తాజాగా ఈ పథకాన్ని అమలుచేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెంకటరమణ మ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, మాజీ చైర్మన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రరెడ్డి, ఎంపీపీ కేతా వేణు గోపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, కొప్పోలు రమాదేవి, చంద్రా వెంకట సుబ్బానాయుడు, శైలజారెడ్డి, బుజ్జిరెడ్డి పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించారు.

● మర్రిపాడు: స్థానిక జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపి అధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు, ఎంఇవో ధనలక్ష్మి పాల్గొన్నారు.

● ఉదయగిరి: స్థానిక అల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కిరణ్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులతో కలిసి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఈ పథకం పునరుద్ధరించి మేలు చేసిందన్నారు. హెచ్‌ఎం బాలకేశవులు, రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గడ్డం వెంకటేశ్వర్లు, ఓబులరెడ్డి, నరసింహా, ఉప్పుటూరి వెంకటయ్య, సజిల్ శివకృష్ణ, కార్తీక్, తేజ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె వాణీశ్రీ



ఉదయగరి: మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, టీడీపీ నాయకులు

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిదులు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా మండలంలోని అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా వైస్‌ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి, అన్నవరం-2 ఎంపీటీసీ సభ్యుడు కోర్శిపాటి మాధవరెడ్డిలు మాట్లాడారు. అన్నవరం ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే గట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి, కార్యదర్శులను వివరణ కోరారు. గ్రామంలో పారి శుధ్యం మెరుగుపడేలా చర్యలు చేపట్టి, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోమవరప్పాడు పంచాయతీ సమస్యలపై టీడీపీ మండల నాయకుడు చేవూరి జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డ బ్ల్యూఎస్, గృహనిర్మాణ, వ్యవసాయం, స్త్రీశిశు సంక్షేమం, ఉపాధిహామీ శాఖల్లోని పనుల పురోగతిపై చర్చించారు. సమావేశంలో సోమశిల ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ మధుమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మాల్యాద్రిరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ తల్లపనేని మధుసూద నరావు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి

అనంతసాగరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, వెంకటేశ్వర్లు, రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి: స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహ, ఐఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గుండ్లపల్లి'కి టీడీపీ శాశ్వత సభ్యత్వం

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా శనివారం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. దీంతో గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్‌ను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆత్మకూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు, కిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు, బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ్రెడ్డి రిత్విక్‌రెడ్డి ఉన్నారు.



మంత్రి ఆనం చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్

సంగంలో రెవెన్యూ సదస్సు

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు సోమ్లా నాయక్ పాల్గొన్నారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. గడువులోపు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణమ్మ, ఉపసర్పంచ్ తేజ, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు యాదవ్, గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

కలువాయి, (ఆంధ్రజ్యోతి): మాదన్నగారిపల్లెలో ప్రభుత్వ భూమిని ఆక్రమించడంతో పాటు ఉపాధి పనులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దారు శ్యామ్‌సుందర్‌రాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు భూమిలో పనులు చేపట్టేందుకు ఉపాధి సిబ్బంది వెళ్లగా ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అభివృద్ధికి మారుపేరు 'మేదరమెట్ల'

జలదంకి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ దివంగత మేదరమెట్ల వెంకటక్రిష్ణారెడ్డి 10వ వర్ధంతిని శనివారం బ్రాహ్మణక్రాకలో ఆయన సతీమణి, జలదంకి జడ్పీటీసీ సభ్యురాలు మేదరమెట్ల శివలీల ఆధ్వర్యంలో ఆయన అభిమానులు, పలుపార్టీల నాయకులు, గ్రామస్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా నివాసప్రాంగణంలోని మేదరమెట్ల సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న మేదరమెట్ల విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి మాట్లాడారు. ఆయన చేసిన సేవలను కొనియడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు క్రిష్ణారెడ్డి, రావి ప్రసాద్‌నా యుడు, మాజీసర్పం చ్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, వైసీపీ నాయకులు చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, ఏగూరి పేతురు పాల్గొన్నారు.

పక్కా ఇళ్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

కొండాపురం, జనవరి4(ఆంధ్రజ్యోతి): పక్కా గృహాలు కావాల్సిన వారు ముందస్తుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్ తెలిపారు. మండలకేంద్రంలోని హౌసింగ్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. 2014 నుండి 2024 వరకు పెండింగ్ బిల్లుల బకాయిలు ప్రభుత్వం చెల్లించేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆదినారాయణ, హౌసింగ్ ఏఈ సల్మాన్ పీడీ వేణుగోపాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, సెంట్రల్ టెలికమ్ డైరెక్టర్ టి.అనూష పాల్గొన్నారు.

● లింగసముద్రం: హౌసింగ్ పీడీ వేణుగోపాల్ శనివారం సాయంత్రం లింగసముద్రం-2, ఆర్ఆర్ పాలెంలలోని లేఅవుట్లలోని ఇసుక నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట డీఈ నారాయణరెడ్డి, ఏఈ నాగరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నిర్మల పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● డ్వామా పీడీ గంగభవాని

ఏఎస్ పేట, జనవరి4 (ఆంధ్రజ్యోతి): దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. శనివారం ఆమె మండలంలోని ఇందిరా జలప్రభ పొలాల రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మామిడి తోటలలో నీటి గుంతలు తవ్వడం ద్వారా సాగునీరు కొరతలేకుండా చేసుకోవచ్చని, ఇందుకోసం ఎన్‌ఆర్‌జీఎస్ ఆధ్వర్యంలో గుంతలు ఏర్పాటుకు నిధులు కేటాయిస్తారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని తెలిపారు. ఆదివారం మండలంలో వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ పర్యటిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఏపీడీ నారాయణరావు, అనుసముద్రం గ్రామ సర్పంచ్ కుదారి హజరత్తమ్మ, ఎన్ఆర్‌జీఎస్ అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంసీ సభ్యులకు శిక్షణ

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీఎంసీల విధులు, బాధ్యతల పట్ల అవగాహన కల్పించారు.

స్వెట్టర్ల పంపిణీ

ఉదయగిరి: గండిపాళెం గ్రామానికి చెందిన జీఎంకే చారిటబుల్ ట్రస్టు అధినేత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి వితరణ చేసిన స్వెట్టర్లను శనివారం ట్రస్టు సభ్యులు గ్రామస్థులకు అందజేశారు.

ఎడ్లబండిని ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

అనంతసాగరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎడ్లబండిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మహేష్ అనే వ్యక్తికి గాయాలైన సంఘటన చిలకలమర్రి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగింది. ఎద్దులకు గాయలయ్యాయి. బండి పూర్తిగా దెబ్బతింది. సమాచారం అందుకున్న 108 వాహనం అక్కడకు చేరుకొని గాయపడిన మహేష్‌ను ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. సోమశిల పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

న్యూస్ బాక్స్

నేత్రదానం

కందుకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసమితితో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న నాగసూరి పద్మావతి నేత్రదానం చేశారు. ఆమె శుక్రవారం రాత్రి మృతిచెందగా కుటుంబసభ్యుల అంగీకారంతో సక్షమ్ ఆధ్వర్యంలో నెల్లూ రు మోడరన్ ఐ హాస్పటల్ వారు నేత్రాలను సే కరించుకుని వెళ్లారు. కార్యక్రమంలో సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు ఉన్నారు.

సర్వీస్ ప్రొవైడర్స్ మేళా

కందుకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త, ప్రతి ఇంటికి ఒక జీవనోపాధి నినాదంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని యువతీయువకులంతా సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని మున్సిపల్ కమిషనర్ అనూష పిలుపునిచ్చారు. లైవ్లీ హుడ్ జాతర కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయంలో సర్వీస్ ప్రొవైడర్స్ మేళా నిర్వహించారు. వందమందికి పైగా పాల్గొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కార్యక్రమంలో మెప్మా టీఈ కాంతయ్య, సీఓలు మాధవీలత, సురత్నకుమారి, ఆర్పీ సంధ్య, ఉప్పుటూరి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కార్యవర్గంలో జిల్లా నేతలకు స్థానం

కందుకూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైసీసీ జిల్లా కార్యవర్గంలో నియోజకవర్గం నుంచి ఏడుగురు నేతలకు స్థానం కల్పించారు. పార్టీ సీనియర్ నాయకుడు తోకల కొండయ్యకు జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు ఇవ్వగా అధికార ప్రతినిధిగా ముప్పవరపు కిషోర్, ఉపాధ్యక్షుడిగా బిల్లా రమణయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పిచ్చపాటి తిరుపతిరెడ్డి, పరిటాల వీరాస్వామి, సెక్రటరీ యాక్టివిటీలుగా చీమల వెంకటరాజు, కొండయ్యలకు అవకాశం కల్పించారు. పదవులు పొందిన వారు నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌కు కృతజ్ఞత తెలిపారు.

ముక్కోటి ఏకాదశ కరపత్రాల ఆవిష్కరణ

కావలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావనం కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ముక్కోటి ఏకాదశికి సంబంధిచిన కరపత్రాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాం మాల్యాద్రి కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. తొలుత ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గుంతలో పడి మరణించిన విద్యార్థి తల్లిదండ్రులు గిరిబాబు, అమృతలను శనివారం సాయంత్రం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు. బాలుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నేతలు ఉన్నారు.

చెక్కనగిషీ స్టాల్‌ను సందర్శించిన ఎంపీ వేమిరెడ్డి

ఉదయగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు నోవెటల్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో ఏర్పాటు చేసిన ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రం స్టాల్‌ను శనివారం నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు చెక్కనగిషీ వస్తువులను ఎంపీకి అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ డే నిర్వహించారు. ప్రతినెలా 5వ తేదీన అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు, ఎత్తు, కొలతలు తీసి రికార్డులో నమోదు చేస్తారు. ఈనెల 5వ తేదీ ఆదివారం రావడంతో ముందుగా శనివారమే ఈకార్యక్రమం నిర్వహించారు. రాళ్లచెలిక మిక్స్‌డ్ కాలనీలో జరిగిన కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ పద్మావతి పరిశీలించారు. అదేవిధంగా వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.

బహుమతుల ప్రదానం

ఆత్మకూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వెస్ట్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం. వై సీతాదేవి పాల్గొన్నారు.

వెంగళాపురంలో పారిశుధ్య పనులు

లింగసముద్రం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దోమల వ్యాప్తితో జ్వరాలు, ఇతరరోగాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వెంగళాపురంలో శనివారం ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచు మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి సాయికిరణ్‌లు పారిశుధ్య పనులు చేపట్టారు.అంతర్గత రోడ్ల వెంబడి, మురుగు కాలువల వెంబడి, వీధుల్లో ఉన్న పిచ్చి మొక్కలు, చిల్లచెట్లు, కంపచెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అలాగే కాలువలో నిల్వ ఉన్న మురుగు నీటిని చెత్తా చెదారాన్ని తొలగింపచేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచు మల్లికార్జునలు మాట్లాడారు. ఆదివారం బ్లీచింగ్ చల్లించి, ఎబేట్ మందు స్ప్రే చేయిస్తామన్నారు. రాత్రి అన్ని వీధుల్లో దోమలు నివారణకు ఫాగింగ్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టిబోయిన రత్తయ్య, చిట్టిబోయి నసుధాకర్, పొట్టిపాటి బ్రహ్మయ్య, లోమడ పెద్ద హనుమంతరావు పాల్గొన్నారు.

వైసీపీ నేత కృష్ణారెడ్డికి మాజీ మంత్రి పరామర్శ

లింగసముద్రం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):పెంట్రాల పంచాయతీ రాళ్లపాడు వైసీపీ మండల జేసీఎస్ కో ఆర్డినేటర్ వరికూటి కృష్ణారెడ్డిని శనివారం కందుకూరు మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన కృష్ణారెడ్డి సతీమణి వరమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, వైసీపీ నేతలు బత్తిన మధుసూదనరావు, ఇంటూరి హరిబాబు, లక్ష్మీనరసింహ, పరిటాల వీరాస్వామి, వరికూటి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా జయకుమార్

కావలి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలాధ్యక్షుడిగా జరుగుమల్లి జయకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భారతీయజనతాపార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా ఆదివారం కావలిలో జరిగిన బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశంలో ఈయన్ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల పరిశీలకులు సీవీసీ సత్యం, మామిడి వెంకటేశ్వర్లు, నేతలు శ్రీనివాసులు, రం గారెడ్డి, క్రాంతికుమార్, కామాక్షి, సురేంద్ర, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య అందించాలి

వలేటివారిపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య అందించాలని కందుకూరు ఐసీడీఎస్ సీడీపీఓ శర్మిష్ఠ తెలిపారు. ఈసీసీఈ దినోత్సవంపై శనివారం చెర్లోపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి, హెచ్‌ఎం రాజేంద్రకుమార్, కార్యకర్తలు రమ, భారతి పాల్గొన్నారు.

తగ్గిన నీటిమట్టం

లింగసముద్రం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో శనివారం సాయంత్రానికి 20.8 అడుగులకు నీటిమట్టం ఉన్నది. గత నెల 31వ తేదీన ప్రాజెక్టు కుడి కాలువకు నీరు విడుదల చేసే సమయంలో ప్రాజెక్టులో 21అడుగుల మేర నీటి మట్టం ఉండేదని ఏఈ చంద్రమౌళి తెలిపారు. సోమశిల ప్రాజెక్టునకు ఉత్తర కాలువ ద్వారా ప్రాజెక్టులోకి 35 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు చెప్పారు.

ఎమ్మెల్యే కాకర్లకు సన్మానం

సీతారామపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, దేవర వెంకటేశ్వర్లు శనివారం సన్మానించారు. వింజమూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కాకర్లను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీలో సమస్యలను ఆయనకు వివరించారు.

దివ్యాంగ పిల్లలకు భోజనం ఏర్పాటు

కందుకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుమారుడు సందీప్ జన్మదినం సందర్భంగా శనివారం నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీల అధ్యక్షులు, పలువురు ముఖ్య నేతలు కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో చిన్నారుల భోజనం ఏర్పాటు చేశారు. జిల్లా టెలికాం అడ్వయిజరీ బోర్డు మెంబరు గుర్రం మాల్యాద్రి, రాజ్యలక్ష్మి దంపతులు అన్నా క్యాంటీన్‌లో మూడుపూటలా భోజనం పెట్టించారు. వేడుకలలో దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాదు, వడ్డెళ్ల రవిచంద్ర, షేక్ రఫీ, శ్రీను, నరేంద్ర పాల్గొన్నారు.

విమర్శిస్తే హెచ్చరికలు

కందుకూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రభుత్వంపైన, స్థానిక ప్రజాప్రతినిధులపైన ఎవరైనా విమర్శలు చేస్తే వారిని పోలీసులు పిలిచి హెచ్చరికలు చేస్తుండటం శోచనీయమని ఆమ్ ఆద్మీ పార్టీ జోన్ కో ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు శనివారం ప్రకటనలో వాపోయారు. సామాన్యులు పరిస్థితి ఇక్కడ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడు పూరిళ్ల దగ్ధం

విడవలూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నారెడ్డిపాళెం బీసీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. బాధితుల కథనం మేరకు.. కాలనీలో నివాసం ఉంటున్న గడ్డం బ్రహ్మయ్య ఇంట్లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఆ మంటలు పక్కన ఉన్న ఇళ్లకు వ్యాపించటంతో గడ్డం చెంచయ్య, ఆడిపూడి ఏడుకొండలు ఇళ్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు.



అన్నారెడ్డిపాళెంలో దగ్ధమవుతున్న పూరిల్లు

హామీలు నెరవేర్చాలని అర్ధనగ్న ప్రదర్శన

ఎన్నికలకు ముందు కూటమి నేతలు విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. శనివారం నెల్లూరు నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లో గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట వారు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో ప్రతి బిడ్డకు రూ.15వేలు ఇస్తానని చెప్పి నేటికీ పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా నేటికీ ఏ ఒక్క పథకం కూడా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవన్‌కిషోర్, నేతలు శివమ్‌వర్మ, హనీష్, అబ్దుల్, జీవన్, సుధీర్, సోహైల్, శరణ్ తదితరులు పాల్గొన్నారు.

-నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి)



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రేపు సాయంత్రం నీటి సరఫరాలో అంతరాయం

నెల్లూరురూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): హెడ్‌వాటర్ వర్క్సులో మరమ్మతుల కారణంగా నగరంలోని కోటమిట్ట, పెద్దబజారు, ఆచారివీధి, ముంగమూరువారివీధి, కామాటివీధి, చాకలివీధి, కాపువీధి, సుబేదార్‌పేట, కాపాడిపాళెం, చిన్నబజారు, సంతపేట, బృందవనం, పొగతోట ప్రాంతాలకు సోమవారం సాయంత్రం తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉచిత సాఫ్ట్‌వేర్ శిక్షణ

నెల్లూరు(సాంస్కృతికం) జనవరి 4(ఆంధ్రజ్యోతి): మూన్ సోషల్ సర్వీసు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ చైర్మన్ షేక్.రబియా సలీమ్, ట్రస్టీ షేక్.సలీమ్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ఈ కేంద్రాన్ని మద్రాసు బస్టాండు వద్ద ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణకు పది, ఇంటర్, డిప్లమో, చేసిన వారు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో సాయికుమార్‌రెడ్డి, షేక్.అషియా సుల్తానా, పఠాన్, సీతారామిరెడ్డి, పాల్గొన్నారు.

ప్రతి శనివారం మాలకొండకు బస్సు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట,ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాలకొండకు నెల్లూరు వన్ డిపో నుంచి ప్రతి శనివారం బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని డీఎం కేవీ మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకు ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి బయలుదేరి, 7.15 నిమిషాలకు ఆత్మకూరు బస్టాండుకు చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి బుచ్చి, కలిగిరి, కొండాపురం మీదుగా మాలకొండకు ఉదయం 11.10 గంటలకు చేరుకుంటుందని తెలిపార. మరో బస్సు ఉదయం 10 గంటలకు ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.20 గంటలకు మాలకొండకు చేరుతుందన్నారు. జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సూచన మేరకు ఈ సర్వీసులు నడుపుతున్నామని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఉపయుక్తం

● ఆర్ఐవో శ్రీనివాసులు వెల్లడి

నెల్లూరు(విద్య), జనవరి 4(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో మధ్యాహ్నభోజన పథకం ఇంటర్ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమని ఆర్ఐవో డాక్టర్ ఎ.శ్రీనివాసులు అన్నారు. నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం పథకం ప్రారంభోత్సవంలో ఆయ న మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే వసతులను సద్వినియోగం చేసుకుని, రానున్న పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు ఆయన భోజనం వడ్డించారు.

● నెల్లూరురూరల్ : సౌత్‌మోపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మితో కలిసి విద్యార్థులకు అన్నం వడ్డించారు. అనంతరం ఆయన 29వ డివిజన్ గాంధీనగర్‌లో శనివారం పర్యటించారు.

● కోవూరు : స్థానిక టీఎన్‌సీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సికిందర్ మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించగా, టీడీపీ నాయకులు మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● తోటపల్లిగూడూరు: ఎన్‌డీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇసుకపాలెం సర్పంచు ఇంగిలాల వెంకట చైతన్యకుమార్, ప్రిన్సిపాల్ ధనుంజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● విడవలూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని టీడీపీ నేత శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. డీసీసీ-2 చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, నాయకులు వంశీకృష్ణారెడ్డి, కృష్ణచైతన్య, ఓగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● పొదలకూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.లక్ష్మీనారాయణ, ఎంఈవోలు రేణుక, శోభనాద్రి, టీడీపీ నేతలు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● మనుబోలు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి పథకాన్ని ప్రారంభించగా, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, టీడీపీ నాయకులు పొన్నూరు రామకృష్ణ య్య, సూరిశెట్టి నాగేశ్వరరావు, రామిరెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

● రాపూరు : స్థానిక సీవీకే జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వరురెడి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హను మంతరావు, సిద్ధవరం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం కోలా నాగేశ్వరరావు, నాయకులు సయ్యద్ సయీద్ పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ

తోటపల్లిగూడూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చెన్నపల్లిపాలెం హైస్కూల్‌లో టెన్త్ చదువుతున్న విద్యార్థిని బసంగారి లాలస ప్రతిభ పరీక్షల్లో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపర్చడంతో అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కాపునూరు విజయమోహన్ రెడ్డి రూ.1.25 లక్షల ల్యాప్ టాప్‌ను వితరణ చేశారు. దానిని శనివారం ఎన్ఆర్ఐ తల్లి లీలావతమ్మ ఆ విద్యార్థినికి పాఠశాలలో అందజేశారు. ఆ విద్యార్థిని ఇంటికి ఇంటర్నెట్ వసతి కల్పించారు. ఈ సందర్భంగా లీలావతమ్మను హెచ్‌ఎం సాయిప్రసాద్, ఉపాధ్యాయులు, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఠాగూర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజీటీ ఎగ్జిబిషన్ ప్రారంభం

నెల్లూరు(విద్య) : డీకే ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో శనివారం కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ(సీజీటీ) కోర్సు విద్యార్థినులు ఏర్పాటు చేసిన ఫొటో, వస్త్ర ప్రదర్శనను మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు విద్యలో ఉత్తమంగా రాణించి ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐవో శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణారావు, రిటైర్డ్ లెక్చరర్ కుసుమకుమారి, హెచ్‌ఎం పార్థసారథి పాల్గొన్నారు.

కృష్ణచైతన్యలో మెగా రక్తదాన శిబిరం

నెల్లూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సహకారంతో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, పీ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అకడమిక్ ప్రోగ్రామ్స్‌లో భాగంగా ఏడాదికి రెండుసార్లు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు, సిబ్బంది కలిసి 200 యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పీ.రాణాప్రమోద్‌రెడ్డి, డీన్ బీ.సుధా రాణి, సీ.రామాంజనేయరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.నాగయ్య, అధ్యాపకులు, సిబ్బంది, రెడ్‌క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

వీఎస్‌యూలో గోడపత్రిక ఆవిష్కరణ

వెంకటాచలం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విక్రమసింహపురి యూనివర్సిటీలో జాతీయ సేవా పథకం యూనిట్-4 ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గోడపత్రికను వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్ రావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువతకు ఆదర్శప్రాయుడైన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పోటీలను జాతీయ సేవా పథకం యూనిట్-4 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో జాతి సమైక్యత భావాన్ని, దేశభక్తిని పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ హనుమారెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

వైద్య పథకాల అమలులో 100 శాతం ఫలితాలు సాధించాలి : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం) జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య పథకాల అమలులో 100 శాతం ఫలితాలు సాధించేలా వైద్యాధికారులు కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఆదేశించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం పీహెచ్‌సీ వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధుల కింద స్క్రీనింగ్‌ను ఏఎన్ఎమ్, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి ఐదిళ్లలో చేయాలన్నారు. వారంలోగా నిర్ణయించిన లక్ష్యాలను సాధించాలన్నారు. క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి, వ్యాధినిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఉమామహేశ్వరి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కందు కూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రజని, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ యశ్వంత్, డెమో కనకరత్నం, మంజుల, సహన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

తెలుగుభాష అమృతభాష : వేమిరెడ్డి



కళాకారులను సత్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జనరవరి 4(ఆంధ్రజ్యోతి): తెలుగుభాష అమృత భాష అని ప్రపంచ తెలుగు సమాఖ్య ఉపాధ్యక్షుడు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో శనివారం ప్రపంచ తెలుగు సమాఖ్య రెండోరోజు సమావేశం జరిగింది. వీపీఆర్ మాట్లాడుతూ అమ్మలాంటి కమ్మనైనది తెలుగుభాష చిరకాలం వర్థిలాలంటే మనమంతా తెలుగు భాషను పరిరక్షిం చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష అభివృద్ధి కోసం సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరాదత్ పడుతున్న తపన అభినందనీయమన్నారు. వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన బృందాన్ని ఆయన సత్కరించారు. కళాకారులను శాలువాలతో సన్మానించారు.

రంగనాథుడికి శ్రీరామ పట్టాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని రంగనాథస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాల సందర్భంగా రంగనాథస్వామికి శనివారం శ్రీరామావతార అలంకారం జరిగింది. ఈ సందర్భంగా ఆళ్వార్లుమోష్టి దివ్యనాలాయిర ప్రబంధ మోష్టి గానం, శాత్తుముర్రై జరిగాయి. ఉదయం ఆండాళ్ అమ్మవారికి విశేష పూజలు, అలంకారం జరిగింది. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా చుండూరువారి వారసులు పాల్గొన్నారు. ఉత్సవాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్త లు, ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాస రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.



రామావతారంలో రంగనాథుడు





మనుబోలు మండల సమావేశం

మనుబోలు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయ, వైద్యం, విద్య, గృహనిర్మాణం, వెలుగు, గ్రామీణ నీటిపారుదల, ఉపాధిహామీ తదితర శాఖల మండల స్థాయి అధికారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, కేటాయింపులు, అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఉపాధ్యక్షుడు తిక్కవరపు వెంకట రమణారెడ్డి, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో జలజాక్షి, ఈవోఆర్‌డీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

● హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లురెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మంజూరైన అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను మార్చిలోపు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. శనివారం బుచ్చి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 25 ఏళ్ల క్రితం ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు శిథిలావస్థలో ఉంటే అలాంటి వారికి కొత్తగా ఇళ్ల మంజూరుకు వివరాలు సేకరించి అర్హులను గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

తోటపల్లిగూడూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోమిరెడ్డి మనుమడు రణదేవ్‌రెడ్డి శనివారం విలుకానిపల్లిలోని ఏకేనగర్, గాంధీనగర్‌లోని స్కూల్స్‌ని సంద ర్శించి గిరిజన విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విలుకానిపల్లి సర్పంచు గోపిరెడ్డి పావని, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి గోపిరెడ్డి వెంకటేష్, ఉడతా శ్రీనివాసులు, సూరకత్తి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు జొన్నవాడ ఆలయ హుండీల లెక్కింపు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలోని హుండీలను ఆదివారం ఉదయం లెక్కించనున్నట్లు ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

న్యూస్ బాక్స్

జగనన్న కాలనీని సందర్శించిన అధికారులు

మనుబోలు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జగనన్న కాలనీని శనివారం అధికారులు పరిశీలించారు. రెండురోజుల క్రితం కాలనీకి దారి లేదని, కొత్త బోరు కావాలని కాలనీవాసులు ఎంపీడీవోకి విన్నవించారు. దీంతో ఎంపీడీవో జలజాక్షి, తహసీల్దార్ సిహెచ్. సుబ్బయ్య, సర్వేయర్ శ్రీనువాసులు కాలనీని పరిశీలించి అక్కడ నివసిస్తున్న వారితో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఉన్నతాధికారులతో చర్చించి కాలనీకి దారి ఏర్పాటు, కొత్త బోరు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణ చేయండి

రాపూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను త్వరగా ముగించి వర్గీకరణ అమలు చేయాలని ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంగన్ మిశ్రాకు ఎమ్మార్పీఎస్ నెల్లూరు జిల్లా అధికార ప్రతినిధి గోవిందురంగయ్య మాదిగ వినతిపత్రం సమర్పించారు. శనివారం నెల్లూరు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయనకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

మోడల్ పేపర్ల పంపిణీ

వెంకటాచలం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుంటపాళెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు అవసరమైన అన్ని సబ్జెక్టుల మోడల్ పేపర్లను శనివారం పంపిణీ చేశారు. అయితే మోడల్ పేపర్లకు అవసరమైన నగదును బీజేపీ మండలాధ్యక్షుడు, నిడిగుంటపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ విరాళం కింద పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ చలపతి, విద్యా కమిటీ చైర్మన్ సునీత, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టళ్ల మరమ్మతులకు రూ.13.5 లక్షలు

మనుబోలు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాల మరమ్మతులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో సాంఘీక సంక్షేమ శాఖ ద్వారా రూ.13.50లక్షలు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన రెండు హాస్టళ్ను పరిశీలించి మరమ్మతల కొరకు ప్రతిపాదనలు వేశారు. బాలుర వసతిగృహానికి రూ.5లక్షలు, బాలికల వసతిగృహానికి రూ.8.50 లక్షలతో నివేదిక పంపిన తరువాత, టెండర్లు అవగానే పనులు ప్రారంభిస్తారని ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, హాస్టళ్ల వార్డన్లు మహేశ్వరి, సుధాకర్‌లు పాల్గొన్నారు. కాగా ఎస్సీ బాలికల వసతి గృహంలో మరమ్మతులకు గురైన బోరుకు టీడీపీ నేత పచ్చిపాల రామిరెడ్డి మరమ్మతులు చేయించారు.

● రాపూరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి రాపూరు మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ మానవతా దృక్పథంతో రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ వి హనుమంతయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పొదలకూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికల్లులో పొదలకూరు ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్‌నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు వెలుగు ఏపీఎం చిన్నయ్య, టీడీపీ తిరుపతి పార్లమెంటు రైతు సంఘం ఉపాధ్యక్షుడు పులిపాటి. వెంకటరత్నంనాయుడు, సంస్థ కార్యదర్శి అహ్మద్, వెలుగు సీసీలు దయాకర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐ బెదిరింపులు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఒంటరి మహిళ అయిన తన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న కబ్జాదారుడికి మద్దతుగా నెల్లూరు రూరల్ సీఐ తనను బెదిరిస్తున్నారని మన్నవరప్పాడుకు చెందిన కూకాటి సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జర్నలిస్టు భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన తులసి సురేష్ తన భూమిని ఆక్రమించేందుకు సీఐ సహాయం తీసుకుంటున్నాడని ఆరోపించారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

లూయిస్ బ్రెయిలీకి నివాళి

నెల్లూరు(సిటీ) : అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ సేవలను ప్రపంచమే ప్రశంసిస్తున్నదని మేయర్ స్రవంతి కొనియాడారు. శనివారం ఆయన జయంతిని పురస్కరించుకుని కార్పొరేషన్ ఎదురుగా ఉన్న పార్కులో బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. లూయిస్ బ్రెయిలీ లిపిని ఆవిష్కరించిన వ్యక్తిని నేడు స్మరించుకోవడం గర్వంగా ఉందన్నారు.



నేడే ముగ్గుల పోటీలు

సిద్ధమైన వేదికలు

● ఉదయం 10 గంటల నుంచి

నెల్లూరులో : వీఆర్ కళాశాల మైదానం
కావలిలో : రైల్వేస్టేషన్ రోడ్డులోని కారోనేషన్ రీడింగ్ రూం ఆవరణం
గూడూరులో : సనత్ నగర్‌లోని శ్రీచైతన్య కళాశాల ఆవరణం

తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వేదికలు సిద్ధమయ్యాయి. ఆదివారం ఉదయం నెల్లూరు నగరం, కావలి, గూడూరు పట్టణాల్లో పోటీలు జరుగుతాయి. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ప్యాషన్ పార్టనర్ డిగోసెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరుగుతాయి. నెల్లూరు నగరంలో వీఆర్ కళాశాల మైదానం (వీఆర్సీ కూడలి), కావలిలో రైల్వేస్టేషన్ రోడ్డులోని కారోనేషన్ రీడింగ్ రూం ఆవరణం, గూడూరులోని సనత్‌నగర్‌లో శ్రీచైతన్య కళాశాల ఆవరణలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మైదానాల్లో ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలో జరిగే పోటీలకు నెల్లూరులోని సీఎంఆర్ చందన బ్రదర్స్ లోకల్ స్పాన్సర్‌గా ఉన్నారు. నెల్లూరులో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి,కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారు. గూడూరులో డీఎస్పీ రమణకుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేయనున్నారు. కావలిలో జరిగే పోటీలకు ఆర్డీవో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీధర్ ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారు. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. వీటితో పాటు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదిన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి.



స్వీట్స్, ఫ్రూట్స్‌తో వెంకటేశ్వరస్వామికి అలంకారం

అలంకారప్రియుడు

వెంకటగిరిటౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హర హర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామిని ఆలయ నిర్వాహకులు ఢిల్లీబాబు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. పలు రకాల స్వీట్లు, పండ్లతో చేసిన అలంకరణ ఎంతగానో ఆకట్టుకుంది. స్వామి వారికి నిర్వహించిన తిరుప్పావడ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తిరుమలలో జాన్వీ కపూర్

తిరుమల, జనవరి4(ఆంధ్రజ్యోతి): నటి శ్రీదేవి కుమార్తె, హీరోయిన్ జాన్వీ కపూర్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి మార్గంలో కాలినడకన శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్నేహితుడు శిఖర్‌తో కలిసి ఆలయంలోకి వెళ్లారు.ఆలయం ముందు జాన్వీ కపూర్‌తో సెల్ఫీలకు అభిమానులు వెంటబడ్డారు. కాగా, జాన్వీ కపూర్ తన సోషల్ మీడియా అకౌంట్లలో శ్రీవారి లడ్డూ తింటున్న ఫొటోను పోస్ట్ చేశారు. ఇది తెగ వైరల్ అవుతోంది.

■ ఇంటర్వ్యూ

రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ విలువలు సవరిస్తున్నారు. కొన్ని చోట్ల పెరిగితే, కొన్ని చోట్ల తగ్గుతుంది. ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తయింది. నిజానికి జనవరి ఒకటి నుంచే మారిన విలువలు అమలులోకి వస్తాయని ప్రభుత్వం ప్రకటించినా వివిధ వర్గాల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో వాయిదా పడింది. వైసీపీ ప్రభుత్వంలోలా అడ్డగోలుగా పెంచడం కాకుండా, వాస్తవ పరిస్థితుల ఆధారంగా విలువల సవరణ ఉంటుందని తెలుస్తోంది. విలువల సవరణతో జిల్లాకు నెలకు రూ.45 కోట్లు అదనపు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కసరత్తు ఎలా జరిగింది.. ఎంతదాకా వచ్చిందీ.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ తిరుపతి బాలాజీ జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్‌కుమార్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వివరించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రిజిస్ట్రేషన్ విలువ 20శాతం పైన పెంచలేదు

● కొన్ని మండలాల్లోనే పెరుగుదల
● కొన్ని చోట్ల తగ్గింపు ● అపార్ట్‌మెంట్ల జోలికి పోలేదు

అభివృద్ధి, మౌళిక వసతులే ప్రామాణికంగా...

తిరుపతి జిల్లాలో భూముల విలువల సవరణకు జాయింట్ కలెక్టర్ కమిటీకి ప్రతిపాదనలు సమర్పించాం. కొత్త ధరలకు సంబంధించిన కసరత్తు పూర్తి అయ్యింది. ఎక్కడైతే కొత్తగా లేఅవుట్లు, నిర్మాణాలు వస్తున్నాయో అక్కడ మార్కెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. అభివృద్ధి, మౌలిక వసతులను దృష్టిలో ఉంచుకుని ధరలు నిర్ణయించడం జరిగింది.

20 శాతంపైన పెంచలేదు

జిల్లాలో ఎలక్ట్రానిక్ క్లస్టర్స్ ఉన్న చోట భూములకు మంచి మార్కెట్ ఉంటుంది.జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన భూములకు కూడా మంచి డిమాండు ఉంటుంది. పండుగ తర్వాత కొత్త లేఅవుట్లు ఎక్కువగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. మంచి కోర్ ఏరియాలో కూడా 20 శాతంకన్నా తక్కువగానే ,ధరల సవరణ చేశాం.

ఆ 7 మండలాలే ప్రధానం

తిరుపతి నగరంలో వాణిజ్య, మాస్టర్ ప్లాన్ రోడ్లున్న ప్రాంతాల్లో భూముల విలువలను సవరించాం.తిరుపతి రూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, చంద్రగిరి మండలాల నుంచి 70 శాతం రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం వస్తుంది.మిగిలిన 30శాతం ఇతర మండలాల నుంచి వస్తుంది. 70శాతంలో కూడా తిరుపతి రూరల్, రేణిగుంట మండలాల నుంచి 55శాతం ఆదాయం వస్తుంది. అందువల్ల ఈ మండలాలపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నాం.

తిరుపతిలో ఇలా చేశాం..

తిరుపతి నగరంలో అపార్టమెంట్ల విలువ పెంచలేదు. అదేవిధంగా 19, 20 డివిజన్ల పరిధిలో ప్రస్తుతం ఆస్తుల విలువ ఎక్కువగానే ఉండడంతో వాటిని కూడా సవరించలేదు. ఇక 1 నుంచి 17 డివిజన్ల వరకు చదరపు గజానికి వెయ్యి రూపాయలు, 21 నుంచి 23 డివిజన్లలో ప్రస్తుతం ఉన్న విలువకు 20 శాతం పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు స్వీకరిస్తాం. కమిటీ ముందు పెట్టి రివిజన్ చేస్తాం.

మూడు గ్రూపులుగా వ్యవసాయ భూములు

ఇప్పటివరకు వ్యవసాయ భూములకు ఒకేవిధంగా రిజిస్ట్రేషన్ విలువ ఉండేది. ఈసారి వాటిని మూడు రకాలుగా వర్గీకరిస్తున్నాం. జిల్లాలో పండ్ల (మామిడి, నిమ్మ తదితరవి), పూల (మల్లె, బంతి, చామంతి)సాగు ఎక్కువగా ఉంటుంది. వీటిని గార్డెన్ కింద తొలి ప్రాధాన్యతగా తీసుకున్నాం. ఆ తర్వాత మాగాణి భూములు, చివరగా మెట్ట (డ్రై) భూములను తీసుకుంటున్నాం. విలువ సవరణలో గార్డెన్, మాగాణి, మెట్ట మధ్య వ్యత్యాసం ఉంటుంది. ఒక సర్వే నంబరు వర్గీకరణ మారితే, దానినే పరిగణనలోకి తీసుకుంటాం. పక్కన మాగాణి ధర మామూలుగానే ఉంటుంది. ఓ పది ఎకరాల వ్యవసాయ తోటలో వంద అంకణాల ఇళ్లు ఉంటే గార్డెన్‌కుండే విలువ, రెసిడెన్షియల్ విలువ వేరుగా ఉంటుంది.



శ్రీరామ్‌కుమార్

పండుగలా..

● ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభం
● వెంకటగిరిలో విద్యార్థులతో కలసి భోంచేసిన కలెక్టర్
● పాపానాయుడుపేటలో వడ్డించిన నరసింహ యాదవ్



విద్యార్థులతో కలిసి భోంచేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శనివారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. జిల్లాలో మొత్తం 21ప్రభుత్వ జూనియర్ కళాశాలుండగా వాటిలో 5,759మంది విద్యార్థులు చదువుతున్నారు. వెంకటగిరి పట్టణం విశ్వోదయా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలెక్టర్ వెంకటేశ్వర్ స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ భానుప్రియల తో కలసి పథకాన్ని ప్రారంభించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని సద్వినియోగం చేసుకుని చదువులపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నానీ పాల్గొని పథకానికి శ్రీకారం చుట్టారు.గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రారంభించగా, సూళ్లూరుపేట నియోజకవర్గంలో సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాయుడుపేట పెసల గుర్రప్ప శెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అక్కడి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించగా వైసీపీ జడ్పీటీసీ వెంకటేశ్వర్లు కూడా పాల్గొన్నారు. రేణిగుంట జడ్పీ హైస్కూలు ప్లస్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ పాల్గొని ఆరంభించారు. ఆయన పిల్లలకు భోజనం వడ్డించడంతో పాటు వారితో కలసి భోజనం చేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ పాల్గొని పథకాన్ని మొదలుపెట్టారు.తిరుపతి రీజనల్ ఇంటర్మీడియట్ అధికారి జి.వి.ప్రభాకర్‌రెడ్డి ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు.కాగా ఇప్పటివరకూ కేవలం ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కూడా వర్తింపజేయడం, శనివారం పథకాన్ని ప్రారంభించడంతో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో సందడి వాతావరణం నెలకొంది.

ముక్కంటి ఆలయ అతిథిగృహంలో

అసాంఘిక కార్యకలాపాలు

● సొంత అడ్డాగా మార్చుకున్న ఒప్పంద ఉద్యోగి కుమారుడు
● మద్యం తాగుతూ, మాంసం తింటూ చిందులు ● ఇద్దరు ఒప్పంద ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు





అతిథిగృహం గదిలో మందు సీసాలు - మోహన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెందిన వరదరాజస్వామి అతిథిగృహంలో కొందరు యువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారు. మద్యం తాగుతూ, మాంసం తింటూ చిందులేశారు. వారి ఆగడాలపై భక్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పవిత్ర క్షేత్రంలో చోటుచేసుకున్న ఈ ఉదంతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ మారింది. శ్రీకాళహస్తికి చెందిన మాధవరెడ్డి ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా నెహ్రూ వీధిలోని ఆలయానికి చెందిన వరదరాజస్వామి అతిథిగృహం పర్యవేక్షకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన కుమారుడు మోహన్‌రెడ్డి అనుకున్నపుడల్లా గదిని తీసుకుని సొంత కార్యకలాపాలకు ఉపయోగించుకునేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 7వ నంబరు గదిని తీసుకుని మిత్రులతో కలిసి మద్యం, మాంసంతో విందు చేసుకున్నారు. శనివారం సాయంత్రం 3గంటల వరకు గది నుంచి వెకిలికేకలు వినబడుతుండడంతో కొందరు భక్తులు నిలదీశారు. దీంతో కొందరు యువకులు అక్కడి నుంచి జారుకున్నారు. మోహన్‌రెడ్డి మాత్రం తాగిన మైకంలో ప్రశ్నించిన వారిపై ఎదురుదాడికి దిగాడు. దీంతో భక్తులు ఆలయాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈవో బాపిరెడ్డి ఫిర్యాదు మేరకు ఒన్‌టౌన్ పోలీసులు అతిథిగృహం వద్దకు చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తండ్రి మాధవరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మరో ఉద్యోగి లక్ష్మీరెడ్డిని సస్పెండ్ చేశారు.



మాధవరెడ్డి

హథీరాంజీ మఠం ఏవోగా బాపిరెడ్డి



తిరుపతి, జనవరి4 (ఆంధ్రజ్యోతి) : శ్రీస్వామి హథిరాంజీ మఠం పరిపాలనాధికారిగా బాపిరెడ్డి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా ఉన్న ఈయనకు ప్రభుత్వం హథిరాంజీ మఠం ఏవోగా అదనపు బాధ్యతలను అప్పగించింది. స్థానిక మఠం పరిపాలన కార్యాలయానికి సతీ సమేతంగా చేరుకున్న దంపతులకు వేద ఆశీర్వాదంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సహాయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

గొప్ప చరిత్రకు నెలవు గూడూరు

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 47వ సమావేశాల్లో వక్తలు





సదస్సులో ప్రసంగిస్తున్న ప్రముఖ చరిత్రకారుడు కాళిదాసు పురుషోత్తం

గూడూరు,జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గూడూరు ప్రాంతం ఎన్నో చారిత్రక విశేషాలకు నెలవని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 47వ వార్షిక సమావేశాలు గూడూరు ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో 'గూడూరు ప్రాంతంలోని ప్రాచీన హిందూ దేవాలయాలు' అంశంపై నెల్లూరులోని ప్రాచీన భారతీయ భాషల విశిష్ట అధ్యయన కేంద్రం సీనియర్ ఫెలో డాక్టర్ సోమరాజుపల్లె మమత అధ్యక్షోపన్యాసం చేశారు.ప్రాచీన నాగ జాతి, బోయలకు కేంద్రస్థానంగా గూడూరు నిలిచిందన్నారు. మౌర్యులకు, శాతవాహనులకు వాణిజ్య కేంద్రంగా ఉండేదన్నారు. గ్రీకు, రోమన్, చైనా దేశాలతో వ్యాపార, వాణిజ్య సంబంధాలను ఈ ప్రాంతం నెరిపిందన్నారు. దక్షిణాఫ్రికా, సింగపూర్, మలేషియాలకు వస్త్రాలను ఎగుమతి చేసిన చరిత్ర ఉందన్నారు. విందూరు చేపలు విదేశాలకు ఇక్కడి నుంచీ చేరాయన్నారు. నీలిమందు, పిచ్చి పొగాకు, వరిసాగులోనూ ఈ ప్రాంతం మొదటి స్థానంలో ఉందన్నారు. నిమ్మసాగులోనూ అగ్రగామిగా నిలిచిందన్నారు. ఆధ్యాత్మిక, కళా నైపుణ్యానికి ఈ ప్రాంతంలోని దేవాలయాలు ప్రతీకలుగా ఉన్నాయన్నారు.నెల్లూరు సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కాళిదాసు పురుషోత్తం, డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ గిరి,ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా రీజనల్ డైరెక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. చరిత్ర నుంచే సమాజ భవిష్యత్తు రూపొందుతుందని అభిప్రాయపడ్డారు. ఏపీ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యుడు ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య చరిత్రలోని బహుముఖ కోణాలపై పరిశోధనలు సాగాల్సిన అవసరముందన్నారు.భావితరాలకు చరిత్రను అందించడమే సమాఖ్య ముఖ్య లక్ష్యమని హైదరాబాదుకు చెందిన ఉర్దూ యూనివర్శిటీ డీన్ ప్రొఫెసర్ వనజ అన్నారు. అనంతరం ధర్మవరం ప్రాంతానికి చెందిన సిండే మారుతీ రావు బృందం ఆధ్వర్యంలో తోలు బొమ్మలాట ప్రదర్శించారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమంలో రాయలసీమ, మాతంగి వ్యవస్థ చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు.ఎస్వీయూ ఆర్కియాలజీ విభాగ రిటైర్డు ప్రొఫెసర్లు కిరణ్ క్రాంత్ చౌదరి, నాగోలు కృష్ణారెడ్డి, ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, చరిత్రకారులు కొప్పర్తి వెంకటరమణ, ఇనుగంటి చంద్ర మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, స్థానిక కార్యదర్శి గోవింద సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ప్రొఫెసర్ ఏఆర్ రామచంద్రరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు చరిత్రకారులు ఆయన్ను అభినందించారు. ఆదివారం ఏపీ హిస్టరీ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసే అవకాశం ఉంది. చరిత్ర బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అవసరమైన కృషికి సంబంధించి పలు అంశాలను తీర్మానాలుగా రూపొందించే అవకాశం ఉంది.

రైతు పురుషోత్తంనాయుడికి అభ్యుదయ పురస్కారం



మంత్రి, ఎంపీ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న రైతు పురుషోత్తం నాయుడు

రేణిగుంట, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : రాస్ కేవీకే దత్తత రైతు పురుషోత్తం నాయుడుకు అభ్యుదయ పురస్కారం లభించింది. రామచంద్రాపురం మండలం మిట్టూరు గ్రామానికి చెందిన పురుషోత్తంనాయుడు వ్యవసాయంలో రాస్ కృషి కేంద్రం సూచనలతో ఆధునిక సాంకేతిక సమగ్ర వ్యవసాయ విధానం పాటిస్తూ పలువురు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గుర్తించిన గుంటూరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, రైతు నేస్తం ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం గుంటూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో ఆయనకు అభ్యుదయ రైతు పురస్కారం అందజేశాయి. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయులు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. రాస్ చైర్మన్ డాక్టర్ ఎఎస్.వెంకటరత్నం, కేవీకే హెడ్ డాక్టర్ శ్రీనివాసులు తదితరులు రైతు పురుషోత్తం నాయుడును అభినందించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ దర్శకుడు ఆదిత్య, మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తెలంగాణ ఎమ్మెల్యే నవీన్‌కుమార్ ఉన్నారు.



ఆదిత్య





ఆర్పీ ఠాకూర్- మురళీమోహన్

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 10కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం : రూ.3.34 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 56,550

తలనీలాలు సమర్పించినవారు : 28,853



మహాక్షేత్రం : తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం



ఆలయ గోపురం

ఏడు కొండలస్వామికి స్వయానా అన్న గోవిందరాజులు. కొండ మీద తమ్ముడికి భక్తులు నిలువు దోపిడీలు ఇచ్చి గోవిందలు పెడుతూ ఉంటే, కొండకింద ఉండే గోవిందరాజులు మాత్రం ఏడుకొండలస్వామికి వచ్చిన సొమ్మును లెక్కించి లెక్కించి అలసిపోయి, కుడిచేతిని తలకింద పెట్టుకుని పడుకుని ఉంటాడు.



అలసిన స్వామి!



గోవిందరాజస్వామి ఆలయం

తిరుపతి(కల్చరల్)

తిరుపతి పట్టణంగా ఉన్నపుడు.. ఎక్కడ నుంచి చూసినా ఆకాశంలోకి గర్వంగా తలెత్తి నిలబడి నేనున్నానన్నట్టుగా కనబడేది గోవిందరాజస్వామి గుడి గోపురం.

తిరుపతి నగరంగా మారినాక.. ఆకాశాన్ని తాకే బహుళ అంతస్తుల భవనాల నడుమ తొంగి చూస్తున్నట్టుగా కనిపించి మాయమవుతోంది ఈ మహాగోపురం.

దక్షిణ భారతదేశంలోనే పురాతన చారిత్రక ఆనవాలు గోవిందరాజస్వామి గుడి. తొలినుంచీ ఎందుకోగానీ తిరుమలలా, తిరుచానూరులా భక్తుల రద్దీ ఇక్కడ కనిపించదు. విశాలమైన ఆలయమూ, ఆదాయమూ ఉన్నప్పటికీ 15వ శతాబ్దం వరకూ ఈ ఆలయానికి పెద్దగా ప్రాశస్త్యం లేదు. శ్రీకృష్ణదేవరాయలు ఏడుమార్లు తిరుమలకు వచ్చినా, ఈ దారిలోనే శ్రీకాళహస్తికి వెళ్లినా గోవిందరాజులును ఎందువలననో దర్శించుకోలేదు. ఒక్క సాళువ నరసింగరాయలు మాత్రమే 1494 వరకూ ఈ ఆలయంపై శ్రద్ధ చూపించినట్లు తెలుస్తోంది. ఇదే ఆనవాయితీని ఇప్పటి పాలకులు కూడా కొనసాగిస్తున్నారు. తిరుమల కొండకు వచ్చే ప్రముఖులు, తిరుచానూరు అమ్మవారిని కూడా దర్శించుకుంటారు గానీ నగరం నడిబొడ్డున ఉండే గోవిందరాజస్వామిని మాత్రం దర్శించుకోవడానికి ఆసక్తి చూపించరు. అయినా సాధారణ భక్తులు మాత్రం, రైల్వే స్టేషనుకు ఎదురుగానే ఉండే ఈ ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకుని వెళ్తుంటారు.



రాజగోపురం

ఇక గోవిందరాజస్వామిగుడి రాజగోపురాన్ని మట్ల కుమార అనంతరాయ అనే దేవచోళ కుటుంబానికి చెందిన రాజు క్రీ.శ. 1628లో నిర్మించారు. ఏడు అంతస్తులు, 50 మీటర్ల ఎత్తు ఉన్న గోపురం ఇది. గోపురం మీద రామాయణ ఘట్టాలను తెలిపే వందలాది శిల్పాలు ఉంటాయి.

గుడి నిర్మాణ చరిత్ర

క్రీ.శ.1130 తర్వాత ఈ ఆలయ నిర్మాణం 89 సంవత్సరాల పాటు పలు దశలుగా సాగింది. క్రీ.శ. 1219లో లోపలి గోపురం నిర్మాణం జరిగింది. అంచలంచెలుగా గుడి విస్తరణ జరిగింది. 1220న రామానుజ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. దాని తరువాత 230 సంవత్సరాలకు 1457లో మరికొన్ని నిర్మాణాలు జరిగాయి. 1330వ సంవత్సరం నుంచి ఈ ఆలయానికి సంబంధించిన అనేక దానశాసనాలు లభిస్తున్నాయి. ఇద్దరు ద్వార పాలకులను నంద్యాల నారప్పరాయ అనే వ్యక్తి 1549 మార్చి 18న ఏర్పాటు చేసినట్టు శాసనం ఉంది. అలాగే క్రీ.శ. 1219లోనే గోవిందరాజ ఆయంలో అఖండదీపం వెలిగించేందుకు వీరనరసింహరాయల రాణి 32 గోవులను సమర్పించింది. విజయనగర ఆలయ నిర్మాణ శైలిలో ఉండే ఈ ఆలయంలోని వసంత మండపాన్ని అహోబిల మఠానికి చెందిన వన శఠగోప జీయర్ క్రీ.శ.1494లో నిర్మాణం చేశాడు. అయితే ఇది పూర్తి కాలేదు. దీనిని ఆ తరువాత రెండువేల వణాల సొమ్ముతో నల్లార్ అంగాండి అనే వ్యక్తి పూర్తి చేసినట్లు ఆధారాలున్నాయి. నీరాళి మండపాన్ని పోటు సమీపంలో అప్పాపిళ్లై అనే వ్యక్తి క్రీ.శ.1506లో నిర్మించాడు. క్రీ.శ.1497 ప్రాంతంలో చిత్రకూట మండపం, క్రీ.శ.1542 ప్రాంతంలో లక్ష్మీ మండపం వాడుకలోకి వచ్చినట్లు ఇందుకు సంబంధించిన దాన శాసనాల ద్వారా తెలుస్తోంది. వేదాంగదేశికకుల సన్నిధికి సమీపంలోని నాలుగుకాళ్ల మండపం 1494లో నరస రాజ ఉడైవరులు కట్టించారు.

ఉపాలయాలు : ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుడు, గోదాదేవి (ఆండాళ్) ఆలయం, చక్రత్తాళ్వార్ (సుదర్శన చక్రం), విష్వక్సేనుడు, నమ్మాళ్వార్, కులశేఖరాళ్వార్, పెరియాళ్వార్, తిరుమంగైయాళ్వార్, మధురకవి ఆళ్వార్, తిరుమలనంబి, రామానుజులు, కురుత్తాళ్వార్, సాలై నాచ్చియారు (పుండరీక వల్లీతాయారు) వంటి ఆలయాలున్నాయి.

ఆలయ వేళలు: రోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 దాకా.

పూజలు, కైంకర్యాలు: తిరుమల తరహాలోనే సుప్రభాతం, తోమాల, అభిషేకం, ఏకాంత సేవలు జరుగుతాయి. టికెట్ ధరలు రూ.5 నుంచి రూ.20 దాకా మాత్రమే ఉంటాయి.

క్రీ.శ. 9,10 శతాబ్దాలనాటి కథ..

దక్షిణాదిలో శైవం పుంజుకుంది. విష్ణు ఆరాధనకు అడ్డంకులు ఏర్పడినాయి. అప్పటి చోళరాజు 1వ కుళోత్తుంగచోళుడు చిదంబరంలోని గోవిందరాజుల విగ్రహాన్ని ఆలయం నుంచి పెకిలించివేశాడు. హోయసల రాజ్యం (మైసూరు)లో ప్రవాసం ఉన్న రామానుజులు సూచనతో విగ్రహం తిరుపతికి చేరింది. అప్పటికే కపిల తీర్థానికి దక్షిణంగా ఉన్న కొత్తూరులో శ్రీపార్థసారథి ఆలయం ఉండేది. ఈ ఆలయ ప్రాకారంలోనే గోవిందరాజులకు ఒక గర్భగుడి నిర్మించారు. 1130 ఫిబ్రవరి 24న గోవిందరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగిందంటారు. అందువలన ఈ గుడి ప్రాంతాన్ని గోవిందరాజపురం అని పిలిచేవారు. తర్వాత దీనినే రామానుజపురం అని పిలిచేవారు. తిరుపతి అనే పేరు ఎప్పటి నుంచి వాడుకలోకి వచ్చిందో చెప్పే ఖచ్చితమైన ఆధారాలు లేవు.

ముఖ్యమైన ఉత్సవాలు

వార్షిక బ్రహ్మోత్సవాలు: మే-జూన్‌లో ఎనిమిది రోజులు జరుగుతాయి. నాలుగవ రోజు గరుడసేవ జరుగుతుంది.

తెప్పోత్సవాలు: ఫిబ్రవరి మూడవ వారంలో ఆరు రోజులు జరుగుతాయి.

ఇంకా.. జనవరి రెండవ వారంలో పదమూడు రోజులు అధ్యయనోత్సవాలు, ఇదే నెలలో గోదా పరిణయం, మార్చిలో సాలై నాచియార్ పంగుణి ఉత్సవం, జూలైలో జ్యేష్ఠాభిషేకం మూడు రోజులు, సెప్టెంబరులో పవిత్రోత్సవం మూడు రోజులు, ప్రతి నెలా పున్నమి గరుడసేవ జరుగుతాయి.



ఆలయ పుష్కరిణి

జోరుగా వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు







స్వర్ణరథాన్ని ట్రయల్ రన్ చూస్తున్న అధికారులు - మహద్వార గేట్లను శుభ్రపరుస్తున్న సిబ్బంది - సెట్టింగుల కోసం తీసుకువచ్చిన సామగ్రి

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి సంబంధించిన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. జనవరి 10న ఏకాదశి, 11న ద్వాదశిని పురస్కరించుకుని 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠద్వార దర్శనాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ గోపురం అలంకరణలకు లైట్లను సిద్ధం చేస్తున్నారు. అలాగే మహద్వారం గేట్లను ప్రత్యేక రసాయనాలతో శుభ్రపరుస్తున్నారు. ఇక, ఈ ఏడాది ప్రత్యేకంగా మైసూరు దసరా ఉత్సవాల్లో విద్యుత్, పుష్పాలంకరణలు చేసే ప్రత్యేక నిపుణులను తిరుమలకు రప్పించారు. వారు ప్రస్తుతం ఆలయం ముందు ప్రత్యేకంగా ఓ షెడ్‌ను ఏర్పాటు చేసి, సెట్టింగ్ నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఏకాదశి సందర్భంగా నిర్వహించే స్వర్ణరథాన్ని కూడా అధికారులు సిద్ధం చేస్తున్నారు. శనివారం స్వర్ణరథాన్ని కొంతదూరం ముందుకు కదలించి పనితీరును పరిశీలించారు. ఇక భక్తులకు ఇబ్బంది లేకుండా నారాయణగిరి వద్ద పటిష్టమైన క్యూలు ఏర్పాటు చేస్తున్నారు.



విద్యుత్ అలంకరణల కోసం సిద్ధం చేస్తున్న లైట్లు

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్, ఈవో

వైకుంఠద్వార దర్శనం కోసం తిరుమలలో జరుగుతున్న ఏర్పాట్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శనివారం పరిశీలించారు. ముందుగా బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌కు చేరుకుని అక్కడ స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీచేసే కేంద్రాలను చూశారు. తర్వాత ఔటర్ రింగ్ రోడ్డు, కృష్ణతేజ రెస్ట్ హౌస్ వద్దనున్న క్యూలు, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. అన్నమయ్య భవనంలో ఏర్పాట్లపై టీటీడీ, జిల్లా, పోలీసు అధికారులతో సమీక్షించారు. అనంతరం ఈవో శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ టికెట్లు, టోకెన్లు ఉన్న వారికే వైకుంఠద్వార దర్శనాలు ఉంటాయని మరోసారి స్పష్టం చేశారు. వీఐపీలు వచ్చే క్రమంలో ట్రాఫిక్ సమస్య లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దాదాపు 7 లక్షల మంది భక్తులు వైకుంఠద్వార దర్శనం చేసుకుంటారనే అంచనా వేస్తున్నామని తెలిపారు. కాగా, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తిరుపతిలోని పలు కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.

పాఠశాలలో 24 మంది విద్యార్థినులకు అస్వస్థత





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు - పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 24 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం మధ్యాహ్నం భోజనం చేశాక వాంతులు, విరేచనాలు కావడంతో వీరిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పాఠశాలలో 654 మంది చదువుతున్నారు. ఒకే ప్రహరీ ఆవరణలో జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ఉన్నాయి. తొలుత జూనియర్ కళాశాల విద్యార్థినులకు డొక్కా సీతమ్మ భోజనం పథకం కింద వంట చేశారు. ఆ వంట కార్మికులే తరువాత హైస్కూలులో భోజనం తయారు చేశారు. అయితే ఈ భోజనం సరిగ్గా ఉడకలేదని సమాచారం. పాఠశాల సమయం ముగుస్తుండటంతో హడావుడిగా ఈ అన్నం పెట్టారని విద్యార్థినులు చెబుతున్నారు. దీంతో స్వల్ప అస్వస్థతకు గురైన 24 మంది విద్యార్థులను చంద్రగిరి ఆసుపత్రికి తరలించి, వైద్య సేవలు అందించారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసరావు, చంద్రగిరి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణలతో కలిసి బాధిత విద్యార్థినులను ఎమ్మెల్యే పులివర్తి నాని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. కాగా వంట కార్మికులపై గతంలో ఫిర్యాదులు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ ఒత్తిళ్లతో తొలగించలేదు. వీరి నిర్లక్ష్యం వల్ల చాలాసార్లు భోజనం చేయడంలేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు.

కలెక్టర్‌కు మంత్రి సవిత ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సవిత కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. విషయం తెలుసుకున్న వెంటనే కలెక్టర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. అస్వస్థతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి, సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పర్యాటక, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధికి సూచనలు ఇవ్వండి

- మైస్ టూరిజం కాన్ఫరెన్సులో కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యాటక, ఆధ్యాత్మిక రంగాలకు మంచి ప్రాధాన్యత ఉందని, వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. ఐఐటీ కళాశాల క్యాంపస్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ జిల్లా పర్యాటక కౌన్సిల్ తిరుపతి ఆధ్వర్యంలో జిల్లాలో మైస్ పర్యాటక రంగంపై ఒకరోజు సదస్సు నిర్వహించారు. పలు యూనివర్సిటీల వీసీలు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ రంగ ప్రతినిధులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మైస్ టూరిజం అభివృద్ధికి గల అవకాశాలు,అనుసంధానం తదితర అంశాలపై ప్రణాళికలు తయారు చేయాలన్నారు. జిల్లాలో 75 కిలోమీటర్ల నిడివి గల సముద్ర తీరం, ఆరు బీచ్‌లు, పలు పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్నాయని,వాటి అభివృద్ధిపై సూచనలు,సలహాలు ఇవ్వాలని కోరారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఐఐటీ, ఐజర్, సంస్కృత కళాశాలలు,పలు యూనివర్సిటీలు ఉన్నాయని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రొఫెసర్ వెంకట్రావు, వినోద్‌గోపాల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

అంధుల క్రికెట్ పోటీల విజేత తిరుపతి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంధుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని అంధ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో విశాఖపట్నంపై తిరుపతి జట్టు గెలిచి టోర్నీ విజేతగా నిలిచింది. స్థానిక రామ్‌నగర్‌లోని యాదవ కల్యాణ మండపంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్‌రెడ్డి, మీనాక్షమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, లేడీస్‌క్లబ్ సభ్యురాలు శ్రీదేవి, వైద్యులు భవాని, పీఓసీ రమణ, అంధుల ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యదర్శి సాజియలీ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అడవిలో దారితప్పిన విద్యార్థుల ఆచూకీ లభ్యం

- జలపాతంలో విద్యార్థి మృతి
- అడవిలో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది గాలింపు
- అర్ధరాత్రి విద్యార్థులను కనుగొన్న పోలీసులు



రైల్వే కోడూరుకు చేరుకున్న విద్యార్థులు

రైల్వేకోడూరు/శ్రీకాళహస్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవిలో దారి తప్పిన విద్యార్థులను శుక్రవారం అర్ధరాత్రి 12.40 గంటలకు కనుగొన్నారు. గుంజన జలపాతం సమీపంలోని సుడిగుండంలో పడిన ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... శుక్రవారం ఉదయం 10 గంటలకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పరిధిలోని పానగల్ ప్రాంతానికి చెందిన పెద్దేశుగారి సాయిదత్ (ఓపెన్ డిగ్రీ విద్యార్థి) (26), పట్నం గిరి (బీటెక్ విద్యార్థి), తమ్మన్నగారి కేదార్‌నాథ్ (బీటెక్ విద్యార్థి), వి.దినేశ్ (చెన్నైలో ఉద్యోగి), పి.దినేష్ (బీటెక్), ఇ.మోహన్‌క్రిష్ణ (డిగ్రీ విద్యార్థి)లు తమ స్వగ్రామమైన పానగల్ నుంచి రైల్వేకోడూరు మండలంలోని మాధవరంపోడుకు సుమారు 20 కిలోమీటర్ల దూరం శేషాచలం అడవిలో ఉన్న గుంజన జలపాతం వద్దకు రెండు మోటారు బైకుల్లో బయలుదేరారు. మాధవరం పోడుకు సమీపంలో ఉన్న వాగేటికోన మినీ రిజర్వాయర్ వద్ద మోటారు బైకులను పార్క్ చేసి అక్కడి నుంచి కాలినడకన గుంజన జలపాతం వెళుతుండగా నీటి ఒరవడి ఎక్కువగా ఉండడం, చీకటి పడడంతో జలపాతం వద్దకు వెళ్లలేకపోయారు. ఒక చిన్నపాటి కొండపై కూర్చున్నారు. ఇందులో సాయిదత్, మోహన్‌కృష్ణ, వి.దినేష్ జారి నీటి సుడిగుండంలో పడిపోయారు. కేదార్‌నాథ్, పి.దినేష్, గిరి నీటిలోకి దిగి మోహన్‌కృష్ణ, వి.దినేష్‌లను కాపాడారు. సాయిదత్ జాడ కనిపించలేదు. దినేష్ అక్కడి నుంచి పది కిలోమీటర్లు నడుచుకుని సెల్‌ఫోన్ సిగ్నల్స్ వచ్చే ప్రాంతానికి వచ్చి బంధువులు, 108కు సమాచారం అందించి లోకేషన్ పంపాడు. కొన్ని గంటల తర్వాత శవం నీటిపై తేలియాడింది. శవాన్ని బయటకు తీశారు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్‌బాబు, సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సిబ్బంది కలసి అడవిలో గాలింపు చర్యలు చేపట్టి అర్ధరాత్రి 12.40 గంటలకు వారు ఉన్న చోటును కనిపెట్టారు. తెల్లవారుజామున 4.30 గంటలకు వారంతా రైల్వే కోడూరుకు చేరుకున్నారు. విద్యార్థులను రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. సాయిదత్ శవాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్ష కోసం తరలించినట్లు ఎస్ఐ నవీన్‌బాబు తెలిపారు. సాయిదత్ మృతితో పానగల్‌లో విషాదచాయలు అలముకున్నాయి. శ్రీకాళహస్తి శ్రీరామ్‌నగర్‌కాలనీకి చెందిన దత్తసాయి ఆధ్యాత్మిక వేదికల్లో డ్రమ్స్ వాయిద్యం చేస్తుండేవాడు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిరోజూ రాత్రి ఏకాంతసేవ సమయంలో స్నేహితులతో కలిసి డ్రమ్స్ వాయిద్యాన్ని ఉచితంగా చేసేవారు.



మృతిచెందిన సాయిదత్

రూ.1.13 కోట్లతో నగరవనం ఏర్పాటు

● ఎమ్మెల్యే విజయశ్రీ



నగరవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల, విజయభాస్కర్‌రెడ్డి

నాయుడుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతతకు పార్కులు ఎంతో అవసరమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట-బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో 35 ఎకరాల విస్తీర్ణంలో అటవీశాఖ ఏర్పాటు చేసిన నగరవనాన్ని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయుడుపేట ప్రాంతానికి సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నగరవనం ఏర్పాటు చేయడం పట్టణ ప్రజలకు సంతోషదగ్గ విషయమన్నారు. రేంజర్ డీవీ రమణయ్య, డీఆర్‌వో కోటేశ్వరరావు, ఎఫ్‌ఆర్‌వో సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, నెలవల రాజేష్, పార్థసారథి, పసల గంగాప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, మైలారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో మత్స్యకారులకు మౌలిక వసతులు

వాకాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద తూపిలిపాళెం గ్రామంలో రూ.2 కోట్లతో తుఫాన్ షెల్టర్, డ్రాయింగ్ ప్లాట్‌ఫామ్‌లను అభివృద్ధి చేయనుండటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, తహసీల్దారు రామయ్య శనివారం స్థల పరిశీలన చేపట్టారు. జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ తూపిలిపాళెం గ్రామంలో 1000కి పైగా మత్స్యకారుల కుటుంబాలు సముద్రవేట జీవనాధారం సాగిస్తుండటంతో మౌలిక వసతులు ఏర్పాటులో భాగంగా రూ.2 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే స్థల పరిశీలన చేశామని, రానున్న రోజుల్లో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు రఘు, రెడ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో అంబేడ్కర్ గురుకుల పాఠశాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఆత్మకూరు వెంకటశేషయ్య తదితరులు

వాకాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కొరకు పూర్వ విద్యార్థుల సౌజన్యంతో రూ.25 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఆ పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఆత్మకూరు వెంకట శేషయ్య తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ గురుకుల పాఠశాల ప్రారంభమై సిల్వర్ జూబ్లీ పూర్తిచేసుకోవడంతో 1024 మంది పూర్వ విద్యార్థులమంతా కలసి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశామన్నారు. ఇప్పటికే రూ.2.50 లక్షలతో ఆర్వో ప్లాంట్, మరో రూ.2.50 లక్షలతో స్టేజీ, రూ.25వేలతో ఇన్వర్టర్, ఆఫీసులో ప్రింటర్, అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. ఇంకా పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. ఆదివారం జరుగనున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి అఖిలభారత సర్వీస్‌ల్లో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు అచ్చిపాక సునీల్ - ఐఏఎస్, జెట్టి గోపీనాథ్ - ఐపీఎస్, యాగిని యోగానందబాబు - ఐఆర్ఎస్‌లు పాల్గొంటారని చెప్పారు. గౌరవాధ్యక్షులు కొణతం సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి దండు ప్రసాద్, కోశాధికారి కిషోర్‌కుమార్, ప్రధాన కోశాధికారి డిక్కి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణ ఫార్మసీకి న్యాక్-ఏ గ్రేడ్ గుర్తింపు



నాక్-ఏ గుర్తింపు పత్రాన్ని చూపుతున్న ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, ఏవో మనోహర్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు

సూళ్లూరుపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట గోకులకృష్ణ ఫార్మసీ కళాశాలకు న్యాక్-ఏ (ఎన్ఏఏసీ) గ్రేడ్ గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ బాలగాని పవన్ కుమార్ తెలిపారు. శనివారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబరు 25, 26 తేదీల్లో తమ కళాశాలలో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) నుంచి ముగ్గురు సభ్యులతో కూడిన బృందం పర్యటించిందని చెప్పారు. బృందం సభ్యులు కళాశాలలో బోధన పద్ధతులు, మౌలిక వసతుల కల్పనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. ఈ మేరకు కళాశాలకు నాక్-ఏ గ్రేడ్ లభించిందని తెలిపారు. నాక్-ఏ గ్రేడ్ సాధించేందుకు కృషి చేసిన సిబ్బందిని కళాశాల నిర్వాహకులు బ్రహ్మయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పీకే దేవిబాల, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, ఏవో మనోహర్, అధ్యాపకులు నాగూరు, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సూళ్లూరుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన పట్టణ బీజేపీ అధ్యక్షుడు అత్తిరాల కిరణ్ కుమార్ అన్నారు. శనివారం ఆయన నివాసంలో బీజేపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ పట్టణ అధ్యక్షుడుగా పార్టీ అవకాశం కల్పించిందని, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలు అందరికీ అందేలా చొరవ తీసుకొంటామన్నారు. బీజేపీ నాయకులు కిరణ్ కుమార్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. బీజేపీ నాయకులు తన్నీరు శేషగిరిరావు, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, నూతలపాటి శ్రీనివాసులు, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి బలమైన పునాది అంగన్‌వాడీ కేంద్రాలు

డక్కిలి, జనవరి 4: (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు బలమైన పునాది వేయాలని అంగన్‌వాడీ అధికారిణి ఆర్.పరిమళ అన్నారు. శనివారం మండలంలోని డి.వెల్లంపల్లి, డక్కిలి-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇసీసీఇ (ఎర్లీచైల్డ్‌కేర్ ఎడ్యుకేషన్) కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం పెంచలయ్య, అంగన్‌వాడీ టీచర్లు సుకన్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

నాయుడుపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని డీఎస్పీ చెంచుబాబు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. శనివారం రాత్రి సర్కిల్‌కార్యాలయానికి చేరుకొని రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. అర్బన్, రూరల్ సీఐలు బాబీ, సంగమేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

- జూదరుల అరెస్టు

డక్కిలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం దేవులపల్లి గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించి పలువురు జూదరులను అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. దేవులపల్లి గ్రామంలోని డంపింగ్ యార్డు వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.5,250 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వన్‌మేన్ కమిషన్‌కు వినతి



రంగనాథ్ మిశ్రాకు వినతిపత్రం అందజేస్తున్న నాయుడుపేట మాల ఐక్యవేదిక నాయకులు

నాయుడుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన్ మేన్ కమిషన్ చైర్మన్ రంగనాథ్ మిశ్రాకు నాయుడుపేట మాల ఐక్యవేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు. నెల్లూరులో శనివారం ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయసేకరణ కోసం రంగనాథ్ మిశ్రా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయుడుపేట మాల ఐక్యవేదిక నాయకులు ఆయన్ను కలసి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వినతిపత్రం అందజేసినట్లు ఐక్యవేదిక నాయకులు తెలిపారు. వినతిపత్రం అందజేసినవారిలో దారా కోటయ్య, రౌతు నరసయ్య తదితరులు ఉన్నారు.

మనోధైర్యంతో ముందుకు సాగాలి

గూడూరు అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు అధైర్యపడకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని ఎంఈవో కాంచన అన్నారు. శనివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని భవిత క్రేందంలో ప్రపంచ అంధుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రంలోని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఆత్మస్థైర్యంతో కష్టపడితే విజయాలను సాధించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో భారతి, జ్యోతిర్మయి, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీకి నివాళి

సూళ్లూరుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంధుల ఆశాజ్యోతి డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం పట్టణంలోని భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల సేవా సంఘ అధ్యక్షురాలు నాదెండ్ల శాంతకుమారి ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. భవిత కేంద్ర విద్యార్థులకు ప్రముఖ వైద్యులు డాక్టర్ సాయిరాం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసుల రెడ్డి, శీనయ్య, భవిత కేంద్ర ఉపాధ్యాయురాలు భార్గవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రూ.1.40 లక్షల చేయూత



విద్యార్థినులకు నగదు అందజేస్తున్న మునీష్

నాయుడుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ యూఎస్ఏ ఆర్థిక సహాయంతో నాయుడుపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.1.40 లక్షలు అందజేశారు. నాయుడుపేట పట్టణానికి చెందిన అనూష, అనూప్రియ అనే బి.టెక్ ఫైనల్ విద్యార్థినులకు స్థానిక రోటరీక్లబ్ కార్యాలయంలో రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మునీష్ రూ.70వేల చొప్పున రూ.1.40 లక్షలను నగదు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో జయరాజ్‌గోపాల్, రామమోహన్, కృష్ణారావు, నాగరాజు, సుబ్రహ్మణ్యం, గిరీష్, రామకృష్ణ స్వరూప్, కృష్ణారావు, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


నేత్రదానం



సురేంద్ర రెడ్డి (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పట్టణంలోని సూళ్లూరు కాపువీధికి చెందిన పోలంరెడ్డి సురేంద్రరెడ్డి (69) శనివారం మరణించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను చెన్నై శంకర నేత్రాలయకు దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్‌కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో కోటేశ్వరరావు

వెంకటగిరిటౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో కోటేశ్వరరావు, ఎంపీపీ తంబిరెడ్డి తనూజా రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 పంచాయతీల్లో ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గ్రామాల్లో అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మండల స్థాయి అధికారులు ప్రభుత్వం ఇచ్చే పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అమలు చేసేందుకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గూడూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోవిందమాల భక్తబృందం ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ లక్షతులసీ పూజ జరిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య శ్రీకంటి రామమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను పెంచడమే ప్రభుత్వ ధ్యేయం

● డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా ప్రమాణాలను పెంపొందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌బాబు ప్రభుత్వ విద్యాసంస్థలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, ఇశ్రాయేల్‌కుమార్, నరసింహులు, ఎన్‌వీరత్నం, పెంచలయ్య, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, చంద్రనీల్, ప్రణీత్, వెంకటేష్, ప్రిన్సిపాల్ జిలానీబాషా, బుజగేంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి: ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని పెసల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి లోకేష్ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టడంతో విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, నెలవల రాజేష్, పార్థసారథి, పసల గంగాప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, మైలారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యత: ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరిటౌన్(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని ప్రారంభించిందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు క్రీడల్లో కూడా రాణించేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ తమిళనాడులో ఇలాంటి కార్యక్రమం జరుగుతుందని.. అంతకంటే మిన్నగా పౌష్టికాహారం అందించాలని సంకల్పించి సీఎం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పులికల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రబాబు, బీరం రాజేశ్వరరావు, మగ్గం వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

కోట (ఆంధ్రజ్యోతి): కోటలోని అల్లారెడ్డి వెంకటకృష్ణారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం, చిట్టేడులోని నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకం ప్రారంభమైంది. కోటలో జూనియర్, సీనియర్, ఇంటర్ విద్యార్థినులు 104 మందికి మధ్యాహ్న భోజనాన్ని కోట ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్, నెల్లూరుపల్లి కొత్తపాళెం ఎంపీటీసీ యానాటి నారాయణ, యాజమాన్య కమిటీ చైర్మన్ హజీరాలు ప్రారంభించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సురేంద్రబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు వళ్లి, అధ్యాపకులు ఉన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణల తొలగింపు

● బయటపడ్డ ఎర్రచందనం దుంగలు



అక్రమ కట్టడాలను జేసీబీలతో తొలగిస్తున్న దృశ్యం

వెంకటగిరి, జనవరి 4: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉపాధ్యాయ కాలనీ నుంచి ఎన్‌హెచ్ 565 జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో రోడ్డుకిరువైపులా పెద్ద ఎత్తున ఉన్న అక్రమ కట్టడాలను శనివారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య జేసీబీల సాయంతో తొలగించారు. వివరాల్లోకి వెళితే.. ఉపాధ్యాయ నగర్ కాలనీ నుంచి తిరుపతి రోడ్డులోకి వెళ్లే 40 అడుగుల వెడల్పు గల రహదారి అక్రమ నిర్మాణాలతో పది అడుగులకు చేరుకొంది. ఎదురెదురుగా వాహనాలు వస్తే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అధికారులకు ఫిర్యాదులు అందడంతో సుమారు కిలోమీటరు మేర ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మున్సిపల్, రెవెన్యూ సర్వేయర్ల బృందం ఓ వైపు రోడ్డును సర్వే చేస్తూ రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఈ క్రమంలో ఓ వైసీపీ నేత సమీప బంధువు రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఇంటిని అధికారులు తొలగించే క్రమంలో ముందు భాగంలో వేసిన రేకుల షెడ్డును కూల్చివేశారు. దాని నిర్మాణానికి ఉపయోగించిన గుంజలు ఎర్రచందనం దుంగలుగా పోలీసులు గుర్తించి అటవీ అధికారులకు తెలియజేయగా, వారు వచ్చి స్వాధీనం చేసుకొన్నారు. వీటిని ఎక్కడి నుంచి తరలించారన్న విషయాన్ని ఆరా తీస్తున్నారు. ఈ దుంగల విలువ సుమారు రూ.5 లక్షల మేర ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆక్రమణల తొలగింపు కార్యక్రమం మొదలు కాగానే కొంతమంది ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోవడంతో అధికారులు ప్రహరీలు తొలగించారు. పూర్తిగా తొలగింపునకు ఒకటి రెండు రోజులు గడువు ఇచ్చారు. ఇంటిలోని సామాన్లు సర్దుకొని స్వచ్ఛందంగా సర్వేయర్లు ఇచ్చిన మార్కు వరకు అక్రమ నిర్మాణాలను తొలగించకపోతే తర్వాత తామే తొలగిస్తామని అధికారులు తెలిపారు. వెంకటగిరి సీఐ వీవీ రమణ, ఎస్ఐలు సుధాకర్, నాయక్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దాతల సహాయంతో బస్‌షెల్టర్ ఏర్పాటు అభినందనీయం

● ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్కు సమీపంలో దాతల సహాయంతో బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మేనకూరుకు చెందిన కట్టా రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కట్టా సుధాకర్‌రెడ్డి, జ్యోతి దంపతుల సహకారంతో నిర్మించిన బస్ షెల్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, గంగాప్రసాద్, మైలారి రాజశేఖర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయరాజ్‌గోపాల్, పేర్నాటి వెంకటేశ్వర్లు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



కార్మికులతో కలసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పెళ్లకూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పెన్నేపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై విచారణ చేసి యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు ఏ పుల్లయ్య, జీ బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలసి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందగా, 5మంది తీవ్రంగా గాయపడ్డన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించడం కాకుండా పరిశ్రమలలో తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫ్యాక్టరీ నుంచి వచ్చే పొగతో పాటు కెమికల్ నీటి వలన ప్రజలు అనారోగ్యానికి గురవ్వడంతో పాటు పంటలు నాశనం అవుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని లేకుంటే స్థానికులతో కలసి పోరాటాలు చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. నాయకులు పీ మునిరాజా, గురవయ్య, ముకుంద, చంద్ర, వలస కార్మికులు తదితరులు ఉన్నారు.

కోటలో సావిత్రిబాయి జయంతి ఉత్సవాలు



ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

కోట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలను ఎంపీడీవో ఏకొల్లు వేణు, ఎంఈవో దారా మస్తానయ్యలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను పద్మావతి (కొత్తపాళెం), సుజాత (చెందోడు), ఉషాకుమారి (ధైవాలదిబ్బ), ప్రమీల (కోట మెయిన్)లు ఉత్తమ మహిళా ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని ఎంఈవో, ఎంపీడీవోలతోపాటు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు అభినందించారు.

పండుగల విశిష్టతపై వ్యాసరచన పోటీలు

గూడూరు అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తెలుగు పండుగల విశిష్టతపై నేటి తరం విద్యార్థులు అవగాహన పెంచుకునేలా ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించామని సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక గాయత్రి పాఠశాలలో ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు పండుగల విశిష్టత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. వెంకటేశ్వర్లు, ఏలియా, కృష్ణయ్య, శ్రీనివాసులు, కరిముల్లా, రాము పాల్గొన్నారు.

ఆక్రమిత భూములను పేదలకు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న గండవరం సుష్మారెడ్డి

కోట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తిన్నెలపూడి పంచాయతీలో ఆక్రమణదారుల గుప్పెట్లో ఉన్న ప్రభుత్వ భూములను భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని టీడీపీ జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి కోరారు. మండల పరిధిలోని తిన్నెలపూడి సచివాలయంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు జయజయరావు భూసమస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు. అనంతరం సుష్మారెడ్డి మాట్లాడుతూ స్థానిక స్వర్ణముఖినదిలో ఇసుకను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇందుకు స్థానికంగా ఉన్న తమ పార్టీ నాయకులంతా పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఎస్ఐ పవన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దారు అజమతుల్లాఖాన్, ఆర్ఐ మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, వీఆర్వో ఏడుకొండలు, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూములను కేటాయించాలి

తడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను తమకు కేటాయిస్తే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తామని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయిని ఇరకం గ్రామస్థులు వేడుకున్నారు. శనివారం ఇరకం గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సుమారు 52 వరకు అర్జీలు వచ్చాయి. భూముల సర్వే, భూములను కేటాయించాలంటూ గ్రామస్థులు అర్జీలు సమర్పించారు. అలాగే సర్వే నెంబరు 565లో భూములు అన్యాక్రాంతమవుతున్నాయంటూ గ్రామస్థులు చేసిన ఫిర్యాదుతో ఆ భూములను ఆర్డీవో పరిశీలించారు. ఈ సదస్సులో తహసీల్దారు శరత్‌బాబు, పంచాయతీ కార్యదర్శి మస్తాన్, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు జయపాల్, వాసు, శేఖర్, గుణ తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం గ్రద్దగుంటలో శనివారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. పట్టాదారు పాసు పుస్తకాలు, భూ సర్వే, భూ ఆక్రమణలు వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెళ్లకూరు (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నిర్వహించిన భూముల రీసర్వేతో హద్దులు మారిపోవడంతో పాటు సెంటు భూమి నుంచి ఎకరం వరకు భూమిని రైతులు కోల్పోయారని ఉమ్మడి సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని జీలపాటూరులో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ భూసమస్యలపై 15 అర్జీలను రైతులు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోషీబాయి, వీఆర్వో వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శాంతి, మండల సర్వేయర్ పూజిత, సచివాలయ సర్వేయర్ లక్షణ్ తదితరులు ఉన్నారు.

7, 8 తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణ

నాయుడుపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన డిస్కం వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఈ నెల 7, 8 తేదీలలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు నాయుడుపేట విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నాయుడుపేట విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టారిఫ్ రేట్లపై జరిగే చర్చలో వినియోగదారులు పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

సంక్రాంతి సంబరాలను జయప్రదం చేయండి

నాయుడుపేటటౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈనెల 11న జరగబోవు సంక్రాంతి సంబరాలను జయప్రదం చేయాలని మండలంలోని ఒద్దిగుంటకండ్రిగంలో శనివారం నేతాజీ కళావేదిక కన్వీనర్ రామచంద్రయ్య ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. సుధాకర్, భాస్కర్, ముత్యాలయ్య, మునస్వామి, జనార్థన్ పాల్గొన్నారు.